


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

నూతన సంవత్సర శుభాకాంక్షలు
2025
పాఠకులకు, పాత్రికేయులకు, మార్కెటింగ్ సిబ్బందికి, రిపోర్టర్ సోదరులకు, మిత్రులకు, బంధువులకు, శ్రేయోభిలాషులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు
విశ్వంవాయిస్ తెలుగు దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 114 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 3 జనవరి 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## తీరు మార్చుకోని బంగ్లాదేశ్



### కృష్ణ దాస్‌కునో రిలీఫ్

**డాకా :** పొరుగు దేశం బంగ్లాదేశ్- హిందువులు, ఇతర మైనారిటీలపై దాడులు, గృహ దహనాలు, అఘాయిత్యాలు, ఆకృత్యాలతో అట్టుడికిపోతోంది. రోజుల తరబడి ఇవి కొనసాగుతూ వస్తోన్నాయి. భారత్ సహా ఇతర దేశాలు బంగ్లాదేశ్ ప్రభుత్వంపై అన్ని రకాలుగా ఒత్తిళ్లు తీసుకొస్తోన్నప్పటికీ- దీనికి మాత్రం బ్రేకులు పడట్లేదు. గత ఏడాది మిగతా 2లో..

## న్యూయార్క్‌లో హాహాకారాలు



### నైట్ క్లబ్‌లో మాస్ షూటింగ్ 11 మంది మృతి

**వాషింగ్టన్ :** కొత్త సంవత్సరం తొలి రోజున అగ్రరాజ్యం అమెరికా అనూహ్య సంఘటనలు చోటు చేసుకుంటోన్నాయి. వరుస ఘటనలతో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. తొలుత- లూసియానాలోని న్యూ ఆర్లీన్స్ సిటీలో ఐసిస్ ఉగ్రవాది సృష్టించిన కారు మిగతా 2లో..

## అన్నదాతలకు మోడీ సర్కారు గిఫ్ట్



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్**
కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్నదాతలకు శుభవార్త అందించింది. పంటల బీమా పథకమైన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ను మరింతగా పెంచాలని నిర్ణయించారు. ఈ పథకం రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తెచ్చిందని కేంద్రం పేర్కొంది. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో దీంతోపాటు పలు మిగతా 2లో..

## రాహుల్ సంచలన నిర్ణయం

### మాజీ సీఎం కు తెలంగాణ బాధ్యతలు



**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్రంలో పార్టీని మరింతగా బలోపేతం చేయటం కోసం రాహుల్ గాంధీ ప్రత్యేకంగా ఫోకస్ చేసారు. పాలనా పరంగా రేవంత్ పైన పూర్తి నమ్మకంతో ఉన్న హైకమాండ్.. ఇప్పుడు పార్టీ వ్యవహారాల కోసం కొత్త ఇంఛార్జ్ ను నియమించాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న దీపాదాస్ మున్షీ స్థానంలో మాజీ సీఎం కు తెలంగాణ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కొత్త మిగతా 2లో..




# తల్లికి వందనం

### వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు
### రైతు భరోసా అమలు ముహూర్తం ప్రకటించిన ప్రభుత్వం..!!

**ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు పైన స్పష్టత ఇచ్చారు. అమరావతిలో నిర్మాణ పనులతో సహా రాష్ట్రంలో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. అదే విధంగా మున్సిపల్ తో సహా పలు చట్ట సవరణలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.**

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఈ నెల 8న విశాఖ లో జరిగే ప్రధాని పర్యటన పైన మంత్రులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేసారు. డీఎస్సీ నియామక ప్రక్రియ పైన చర్చ జరిగింది. సంక్షేమ పథకాల అమలు ఏపీ మంత్రివర్గ సమావేశంలో సూపర్ సిక్స్ పథకాల అమలు పైన చర్చ జరిగింది. వచ్చే విద్య సంవత్సరం లోపు తల్లికి వందనం మిగతా 2లో..


## కేరళలో విషాదకర ఘటన

### మూడు పల్టీలు కొట్టిన స్కూల్ బస్



**కన్నూర్ :** కేరళలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. ఓ స్కూల్ బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఒక విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. కేరళ కన్నూర్ జిల్లాలో ఈ ఘటన సంభవించింది. జిల్లాలోని చెంగాలయి పంచాయతీ పరిధిలో తాలిపరంబ- ఇరిట్టి జాతీయ రహదారిపై గల వలక్కై వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. కురుంబత్తూర్‌లోని చిన్మయ విద్యాలయాకు చెందిన బస్సు అది. బుధవారం సాయంత్రం స్కూల్ ముగిసిన తరువాత విద్యార్థులను వాళ్ల ఇళ్లకు చేరవేయడానికి బయలుదేరింది. మార్గమధ్యలో వలక్కై వద్దకు మిగతా 2లో..

## పిఠాపురం ఎమ్మెల్యే ప్రొగ్రెస్ రిపోర్టు !




**పిఠాపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** మేమంతా పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని నేమ్ ప్లేట్స్ తగిలించుకుని పవన్ అభిమానులు అంతా తెగ తిరిగారు. అయితే పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయిన తరువాత పిఠాపురంలో పర్యటిస్తూ రూల్స్ ని ఎవరూ బ్రేక్ చేయవద్దని చెప్పిన తరువాత ఆ నేమ్ ప్లేట్స్ ని తీసేశారు. అయితే అంత గొప్పగా పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని జనాలు చెప్పుకున్నాక ఆరేడు నెలలలో పవన్ పిఠాపురానికి ఏమి చేశారు అన్న చర్చ వస్తుంది. పైగా ఆయన పూర్తి అధికారాలు కలిగిన ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. దాంతో పిఠాపురం ప్రొగ్రెస్ రిపోర్ట్ ఏంటి అంటే దాని గురించి పవన్ కళ్యాణ్ స్వయంగా తాను ఎమ్మెల్యేగా ఏమి చేశాను అన్న దానిని నూతన సంవత్సరం వేళ రిలీజ్ చేశారు. దాని ప్రకారం చూస్తే కేవలం ఏడు నెలల కాలంలో చాలానే చేశారు అని అంటున్నారు పవన్ విడుదల చేసిన సమగ్ర అభివృద్ధి నివేదికలో అనేక అంశాలను ప్రస్తావించారు. పవన్ ఎమ్మెల్యే అయ్యాక పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక పిఠాపురం నియోజకవర్గంలో ముప్పై మిగతా 2లో..

### శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ రథోత్సవ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలి



3

## కేసీఆర్ ఫ్యామిలీ జైలుకే

### కడియం శ్రీహరి హాట్ కామెంట్స్



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు కాంగ్రెస్ నేత, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో కేసీఆర్ కుటుంబం పెద్ద మొత్తంలో వనరులను దోచుకుందని ఆరోపించారు. కొత్త రకమైన అవినీతికి పాల్పడ్డారన్నారు. మీ కుటుంబంపై అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని కేసీఆర్‌ను ప్రశ్నించారు. లిక్కర్ కేసులో ఇరుక్కుని కేసీఆర్ కూతురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీహార్ జైల్లో ఎన్ని రోజులు ఉందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. మరోవైపు, ఫార్ములా ఈ కేసులో రేపో మాపో కేసీఆర్ కుమారుడు కేటీఆర్ కూడా జైలుకు వెళ్లబోతున్నారని కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్, హరీశ్ రావు అనేక విధాలుగా సాంకేతిక తప్పులు చేశారని మండిపడ్డారు. కల్వకుంట్ల కేసీఆర్ కుటుంబమంతా రేపో మిగతా 2లో..

### సంక్రాంతి నుంచే
## మహిళలకు ఫ్రీ బస్సు

### టీడీపీ ఎంపీ శబరి వెల్లడి..!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్**
ఏపీలో కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సుప్రయాణం కూడా ఒకటి. దీన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ఆరునెలలుగా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. తాజాగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు రవాణాశాఖ మిగతా 2లో..

### జిల్లా స్థాయి క్రీడా పోటీలను
## విజయ వంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ అర్ మహేష్ కుమార్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్**
అమలాపురం జనవరి 2: "కోనసీమ క్రీడోత్సవం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా" పేరిట మండల జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయ వంతం చేయాలని జిల్లా విద్యా, క్రీడా ప్రాధికార అభివృద్ధి సంస్థ అధికా రులను మిగతా 2లో..

### కోటి మంది తెలుగు తమ్ముళ్లకు లోకేష్
## న్యూఇయర్ గిఫ్ట్..!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**
ఏపీలో కొత్త సంవత్సర వేళ తెలుగు తమ్ముళ్లకు మంత్రి నారా లోకేష్ గుడ్ న్యూస్ చెప్పారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కోటి మంది కార్యకర్తలకు మేలు చేసేలా ఓ కీలక ఒప్పందం కుదుర్చుకున్నారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా నిస్వార్ధంగా పనిచేస్తున్న కార్యకర్తలకు మేలు చేసేలా ఈ ఒప్పందం కుదిరింది. దీంతో కొత్త సంవత్సరంలో టీడీపీ కార్యకర్తలకు లోకేష్ కానుక అందించినట్లయింది. ప్రస్తుతం మిగతా 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## తీరు మార్చుకోని బంగ్లాదేశ్

ఆగస్టు 5వ తేదీన ప్రధానమంత్రి షేక్ హసీనా సారథ్యంలోని ప్రభుత్వం కుప్పకూలిన విషయం తెలిసిందే. అప్పటి నుంచీ బంగ్లాదేశ్‌లో అమానుష ఘటనలు చోటు చేసుకుంటూ వస్తోన్నాయి. ప్రత్యేకించి- హిందువులపై విపరీతంగా దాడులు సాగుతున్నాయి. దోపిడీలు, గృహ దహనాలు నిత్యకృత్యం అయ్యాయి. హిందువులతో పాటు ఇతర మైనారిటీలపై ఇస్లామిక్ మతఛాందసవాదులు విరుచుకుపడుతున్నారు. హైందవ ఆలయాలను ధ్వంసం చేయడం, భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న విగ్రహాలను పగులగొట్టడం, మంటల్లో పడేయడం, తగులబెట్టడం రోజువారీ కార్యక్రమంగా మారింది. మహ్మద్ యూనుస్ సారథ్యంలో మధ్యంతర ప్రభుత్వం అక్కడ ఏర్పడినప్పటికీ ఎలాంటి ఫలితమూ ఉండట్లేదు. ఇస్కాన్ ప్రతినిధి, బంగ్లాదేశ్ సమ్మిళిత్ సనాతన్ జాగరణ్ జొటె నాయకుడు చిన్మయ్ కృష్ణ దాస్‌ను అరెస్ట్ చేయడం దీనికి పరాకాష్ఠగా మారింది. తమ దేశ జాతీయ పతాకాన్ని అవమానపరిచారనే కారణంతో గత ఏడాది నవంబర్ 25వ తేదీన ఆయన అరెస్ట్ అయ్యారు. ఢాకా చిత్తోగ్రామ్‌లోని హజ్రత్ షాజలాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్మయ్ కృష్ణ దాస్‌ను వెంటనే విడుదల చేయాలని, హిందువులపై దాడులను అడ్డుకునేలా బంగ్లాదేశ్ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికల ద్వారా ఒత్తిడిని తీసుకుని రావాలంటూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సైతం కేంద్రానికి డిమాండ్ చేసింది. అయినప్పటికీ ఎలాంటి ఉపయోగం ఉండట్లేదు. తాజాగా ఆయన బెయిల్ పిటీషన్ నేడు చిత్తోగ్రామ్ న్యాయస్థానం ముందుకు వచ్చింది గానీ ఎలాంటి ఊరట లభించలేదు. దీనిపై విచారణ అనంతరం బెయిల్ ఇవ్వడానికి చిత్తోగ్రామ్ మెట్రో పాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మహ్మద్ సైఫుల్ ఇస్లామ్ నిరాకరించారు. దేశద్రోహం కేసు కావడం వల్ల అనారోగ్య కారణాలపై బెయిల్ ఇవ్వలేమని కోర్టు వ్యాఖ్యానించినట్లు మీడియా తెలిపింది. బెయిల్‌పై విచారణ అరగంటలోనే ముగిసింది. డయాబెటిక్ సహా పలు అనారోగ్య కారణాలతో చిన్మయ్ కృష్ణ దాస్ బాధపడుతున్నాడని, బెయిల్‌ను మంజూరు చేయాలంటూ ఆయన తరఫు న్యాయవాది చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.

## న్యూయార్క్‌లో హాహాకారాలు

ప్రమాదంలో 15 మంది దుర్మరణం పాలయ్యారు. క్రిక్కిరిసిన బోర్బన్ స్ట్రీట్‌లో ఫోర్డ్ పికప్ ట్రక్‌తో విధ్వంసాన్ని సృష్టించాడు. కనిపించిన వారిని కనిపించినట్టే తొక్కుకుంటూ వెళ్లాడు. అనంతరం తుపాకీతో యథేచ్ఛగా కాల్పులు జరిపాడు. ఆ ఉగ్రవాదిని టెక్సాస్‌కు చెందిన షంషద్-దిన్ జబ్బార్‌గా గుర్తించారు. ఆ వాహనంపై ఐసిస్ జెండా ఉన్నట్లు నిర్ధారించారు. దీని నుంచి తేరుకోకముందే లాస్ వెగాస్‌లో మరో దిగ్భ్రాంతికర సంఘటన చోటు చేసుకుంది. టెస్లాకు చెందిన సైబర్‌ట్రక్ మంటలబారిన పడింది. పేలిపోయింది. అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌కు సంస్థ.. టెస్లా. ఎలక్ట్రిక్ కార్లను తయారు చేసే కంపెనీ ఇది. గత ఏడాది సైబర్‌ట్రక్‌ను అభివృద్ధి చేసింది. ఈ ట్రక్- లాస్ వెగాస్‌లో పేలిపోయింది. మంటల బారిన పడింది. అది కూడా ఆ దేశాధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన హోటల్ వద్ద కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఘటనలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఏడుమంది గాయపడ్డారు. దీనిపై అధ్యక్షుడు జో బైడెన్ సైతం స్పందించారు. దీన్ని ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. అదే సమయంలో న్యూయార్క్‌లో భయానక ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఓ నైట్ క్లబ్‌లో గుర్తు తెలియని వ్యక్తి కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో 11 మంది దుర్మరణం పాలయ్యారు. పలువురు గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నందు వల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం లేకపోలేదని తెలుస్తోంది. న్యూయార్క్ క్వీన్స్ ప్రాంతంలోని అమెజురా నైట్ క్లబ్‌లో ఈ ఘటన సంభవించింది. కొత్త సంవత్సరం వేడుకల్లో మునిగిపోయిన సమయంలో ఒక్కసారిగా బుల్లెట్ల వర్షం కురిసిందక్కడి వారిపై. 11 మంది అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలం మొత్తం రక్తసిక్తమైంది. రక్తమోడింది. క్వీన్స్ ఏరియాలోని 91-12 144, జమైకా స్ట్రీట్‌లో ఉందీ అమెజురా నైట్ క్లబ్. కొత్త ఏడాదిని పురస్కరించుకుని హైఎండ్ పార్టీ ఏర్పాటైందిక్కడ. డీజే సౌండ్స్, లైవ్ పెర్‌ఫార్మెన్స్, మ్యూజిక్ కన్సర్ట్, కాక్‌టైల్‌ను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఫుల్ జోష్‌లో పార్టీ కొనసాగుతున్న సమయంలో ఒక్కసారిగా తుపాకి పేలింది. ఈ ఘాతుకానికి పాల్పడింది ఎవరనేది ఇంకా తెలియరావట్లేదు. దీని వెనుక ఉగ్రవాద కోణ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమౌతోన్నాయి. సమాచారం అందిన వెంటనే న్యూయార్క్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. సమగ్ర దర్యాప్తు చేపట్టారు.

## అన్నదాతలకు మోడీ సర్కారు గిఫ్ట్

కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా బీమా యోజన కేటాయింపులను రూ. 69,515 కోట్లకు పెంచుతూ ఆమోదం తెలిపింది. దీంతో రైతుల పంటలకు మరింత రక్షణ లభించడంతోపాటు నష్టాల పట్ల ఆందోళన తగ్గనుంది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే, 50 కిలోల డీఏపీ ఎరువుల బస్తాను రూ. 1350 చొప్పున రైతులకు అందజేసేందుకు రూ. 3850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగిస్తున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 2025లో తొలి కేబినెట్ భేటీని ప్రధాని మోడీ రైతులకు అంకిత చేశారని చెప్పారు. రెండు పంటల బీమా పథకాలకు పీఎంఎఫ్‌బీవై, రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్(%=ఔదీజ×ూ%) పథకాలను కేంద్రం 2025-26 వరకు పొడిగించినట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. వీటిని 15వ ఆర్థిక సంఘం కాలానుగుణంగా పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐ పథకాలకు కేటాయింపులను రూ. 69,515.71 కోట్లకు పెంచారు. ఈ పంటల బీమా పథకాల అమలులో సాంకేతికతను వినియోగించుకునేందుకు రూ. 824.77 కోట్ల కార్పస్‌తో ప్రత్యేక నిధి ఏర్పాటుకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ టెక్నాలజీ వినియోగంతో పంట నష్టం అంచనాలను త్వరగా తెలుసుకోవడంతోపాటు క్లెయిమ్ సెటిల్మెంట్, వివాదాలకు తగ్గించేందుకు సహాయ పడుతుందన్నారు. మరోవైపు, కేబినెట్ నిర్ణయాలపై ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వ మాది. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే మన రైతులు గర్వకారణం. 205 మొదటి కేబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేశాం. వారి విషయంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు ఆనందంగా ఉంది' అని ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## రాహుల్ సంచలన నిర్ణయం

ఇంఛార్జ్ గా కాంగ్రెస్ అధినాయకత్వం పలు రాష్ట్రాల పార్టీ ఇంఛార్జ్ ల మార్పు పైన కసరత్తు చేస్తోంది. అందు లో భాగంగా తెలంగాణ బాధ్యతల పైన కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో పార్టీ విజయం సాధించిన తరువాత దీపాదాస్ మున్షీని పార్టీ ఇంఛార్జ్ గా నియమించారు. కాగా, ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లో అవసరాలు.. మారుతున్న రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా కొత్త ఇంఛార్జ్ ల నియామకం పైన నిర్ణయాలు జరుగుతున్నాయి. ఇక, ప్రస్తుత తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ స్థానంలో ఛత్తీస్ ఘడ్ మాజీ సీఎం భూపేష్ బగెల్ ను నియమించాలని డిసైడ్ అయ్యారు. రాహుల్ కసరత్తు దీపాదాస్ మున్షీ సేవలు త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో వినియోగించాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుత మార్పులు చేస్తున్నట్లు చెబుతున్నారు. త్వరలో ఎన్నికలు జరిగే ఢిల్లీ, బీహార్ పైన కాంగ్రెస్ హైకమాండ్ ఫోకస్ చేసింది. అక్కడ ప్రత్యేకం గా ఎంపికగా చేసిన పార్టీ నేతలను మోహరిస్తోంది. సంక్రాంతి లోగానే ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశం ఉంది. అక్కడ ఆప్ తో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేయాలని కాంగ్రెస్ డిసైడ్ అయింది. ఈ క్రమంలో ఢిల్లీతో పాటుగా బీహార్ ఎన్నికలు కాంగ్రెస్ నాయకత్వానికి ప్రతిష్ఠాత్మకంగా మారుతున్నాయి. కాంగ్రెస్ నిర్ణయాలు తెలంగాణ లో పూర్తిగా సీఎం రేవంత్ – మహేష్ గౌడ్ ప్రభుత్వం .. పార్టీ వ్యవహారాలను ముందుండి నడిపిస్తున్నారు. ఇక, త్వరలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ టైం లో రాష్ట్రంలో పార్టీని మరింతగా బలోపేతం చేయటంతో పాటుగా పీసీసీ – జిల్లా కమిటీలు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే కసరత్తు కొనసాగుతోంది. బడ్జెట్ సమావేశాల తరువాత ఈ ఎన్నికలు జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ సమయంలో మాజీ సీఎం కు తెలంగాణ పార్టీ ఇంఛార్జ్ బాధ్యతలు అప్పించాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ మేరకు అధికారికంగా ప్రకటన చేసే ఛాన్స్ కనిపిస్తోంది.

## కేరళలో విషాదకర ఘటన

రాగానే మలుపులో అదుపు తప్పింది. అతి వేగంతో రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. బోల్తా కొట్టింది. హెయిర్ పిన్ బెండ్ వంటి మలుపు అది. ఒక వైపు రోడ్డు వద్ద బోల్తాపడిన బస్సు ఇంకో వైపు రోడ్డుపైకి వచ్చి పడిందంటే దాని వేగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘటనలో 18 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడ్డ వారిలో ఎనిమిది మందిని కన్నూర్ పరియారం ప్రాంతంలో గల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి తరలించారు. వారిలో నెధ్యా రాజేష్ అనే అయిదో తరగతి విద్యార్థిని అప్పటికే మరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు. మరో 10 మందిని తాలిపరంబ ఆసుపత్రికి తీసుకెళ్లారు. భారత్ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద బస్ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. 281 (ర్యాష్ డ్రైవింగ్), 125 (ఏ) (నిర్లక్ష్యం వల్ల ఇతరుల ప్రాణానికి హాని కలిగించడం), 106 (ఒకరి మరణానికి కారణం కావడం) వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

## కేసీఆర్ ఫ్యామిలీ జైలుకే

మాపో జైలులో ఊచలు లెక్కపెట్టబోతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు కడియం శ్రీహరి. మీరు నిజాయితీపరులైతే మీపై ఇన్ని కేసులు ఎందుకు నమోదవుతాయని కేసీఆర్ కుటుంబాన్ని ప్రశ్నించారు. 2014లో కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు ఎన్ని.. ఇప్పుడు ఎన్నో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పుడు రూ. 10 కోట్ల ఆస్తులు లేని మీకు.. ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు, వందలాది ఎకరాల భూములు ఎలా వచ్చాయని కడియం శ్రీహరి ప్రశ్నించారు. దళితబంధులో కమీషన్ తీసుకున్నవారు.. ఇప్పుడు నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడినవారు నీతులు మాట్లాడటం హాస్యాస్పందంగా ఉందని విమర్శించారు. కడియం శ్రీహరి తప్పు చేస్తే ఆధారాలు చూపించాలని.. ఇకనైనా సాక్ష్యాలు లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

## తల్లికి వందనం

అమలు చేయాలని.. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆర్థిక - విద్య శాఖను కేబినెట్ ఆదేశించింది. అదే విధంగా వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం లోగా డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు పైనా చర్చ జరిగింది. వచ్చే నెలలో కేంద్రం పీఎం కిసాన్ నిధులు విడుదల తరువాత వెంటనే అన్నదాత సుఖీభవ నిధులు విడుదల అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేయాలని చంద్రబాబు సూచించారు. కీలక ప్రాజెక్టులకు ఆమోదం రాష్ట్రంలో రెవెన్యూ సదస్సులు జరుగుతున్న తీరుతెన్నుల తో పాటుగా ఆర్థికంగా ఎదురవుతున్న సమస్యల పైన చర్చ జరిగింది. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రెవెన్యూ, ఫైనాన్స్, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రులతో ఉపసంఘం ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ భేటీలో 14 కీలక అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలో రూ. 2733 కోట్ల పనులకు కేబినెట్ ఆమోదిం చింది. అమరావతిలో రెండు ఇంజనీరింగ్ కాలేజీల పనులకు, భవనాలు, లేఔట్‌ల అనుమతుల ను మున్సిపాలిటీలకు అప్పగిస్తూ చేసిన సవరణ ప్రతిపాదనకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్థిక పరిస్థితుల పై పవన్ ఆరా తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంపు ప్రతిపాదనకు కేబినెట్ అంగీకరించింది. పిఠాపురం ఏరియా డెవలప్ మెంట్ అథారిటీలో 19 నూతన పోస్టులకు అనుమతి ఇచ్చింది. ఎస్ఐపీబీ ఆమోదించిన రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 2,63,411 మందికి ఉద్యోగాలు కల్పించే అంశంపై చర్చించారు. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రధాని రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేయాలని మంత్రులకు సీఎం చెప్పినట్లు తెలుస్తోంది. పలు పరిశ్రమలకు భూ కేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పైన పవన్ ప్రత్యేకంగా ఆరా తీసారు. ఆర్థిక శాఖ ప్రస్తుత పరిస్థితుల పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది

కొత్త ఏడాదిలో చంద్రబాబు తొలి సంతకం: వారికి బిగ్ రిలీఫ్

కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం.. గుడ్ న్యూస్ ఇచ్చింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ క్లియర్ చేసింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై చంద్రబాబు సంతకం చేశారు. ఈ కొత్త ఏడాదిలో ఆయన సంతకం చేసిన మొట్ట మొదటి ఫైల్ ఇదే కావడం, పైగా అది పేదల ఆరోగ్యానికి సంబంధించింది ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,600 మంది నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ కింద 24 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ రూపొందించిన ప్రతిపాదనలు అవి. టీడీపీ సంకీర్ణ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలి ఆరు నెలల వ్యవధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వేలాదిమంది లబ్ది పొందగలిగారని ప్రభుత్వం తెలిపింది. ఈ 1,600 మందితో కలిపి కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 9,123 మంది పేదలకు సీఎంఆర్ఎఫ్ కింద 124.16 కోట్ల రూపాయల మేర ఆర్థిక సహాయం అందినట్టయింది. ఈ ఏడాది చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ ఫైల్‌పై సంతకం పెట్టడంతో- తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎంతగానో కట్టుబడి ఉందనే విషయాన్ని మరోసారి రుజువైందని అధికార తెలుగుదేశం పార్టీ తెలిపింది. జనవరి 1వ తేదీన విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలిసిన దుర్గా మల్లేశ్వర స్వామివార్లను దర్శించుకున్న సమయంలోనూ చంద్రబాబు ఇదే అంశాన్ని ప్రస్తావించిన విషయం తెలిసిందే. దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు చెప్పారు. దాన్ని చేతల్లో చూపించారు.

## పిఠాపురం ఎమ్మెల్యే ప్రొగ్రెస్ రిపోర్టు !

పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లుగా పవన్ వెల్లడించారు. దీని కోసం 39.75 లక్షల కోట్లతో ఖర్చు చేయడానికి ఆమోదం కూడా లభించింది అని వివరించారు. అంతే కాదు రెండు కోట్ల ఖర్చుతో నిర్మించతలపెట్టిన టీటీడీ కళ్యాణ మండపం కూడా పిఠాపురానికి రానుంది. 72 లక్షల రూపాయల ఖర్చుతో మోటార్లు పైప్ లైన్ల రిపేర్లు చేయించడం ద్వారా గొల్లప్రోలులో ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం కనుగొన్నామని పవన్ చెప్పారు. మాటామాటా.. టీమ్ ఇండియా డ్రెస్సింగ్ రూమ్ లో డిష్యుం డిష్యుం తన నియోజకవర్గం పరిధిలోని 32 పాఠశాలకు క్రీడా సామగ్రి కిట్లను అందించామని అలాగే ప్రజలకు మంచి వైద్యం కోసం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు సిబ్బందిని నియమించామని తెలిపారు. గొల్లప్రోలులో డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వతమైన పరిష్కారం కనుగొంటున్నామని అదే విధంగా గొల్లప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంచి రోడ్డు కోసం నిధులు మంజూరు చేసి మరీ సిసి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగు లక్షల రూపాయలతో నూతన ఆర్‌ఓ ప్లాంట్, గొల్లప్రోలు ఎంపీపీ పాఠశాలలో ఒక లక్షా 75 వేల రూపాయలతో పెండింగ్ పనులు చేపట్టామని వివరించారు ఇక చేబ్రోలు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో రెండు లక్షల నిధులతో ఆరో ప్లాంటు ఏర్పాటు చేసినట్లుగా కూడా పవన్ స్పష్టం చేశారు. కేవలం ఆరేడు నెలల వ్యవధిలో ఈ పనులు చేపట్టామని రానున్న రోజులలో మరింగగా అభివృద్ధి పనులు చేపడతామని పవన్ చెప్పారు. పారదర్శకత ఉండాలని తాను ఈ వివరాలు వెల్లడిస్తున్నాను అని ఆయన తెలిపారు. మొత్తానికి పిఠాపురం ఎమ్మెల్యే గారి ప్రొగ్రెస్ రిపోర్ట్ బాగానే ఉందని సోషల్ మీడియాలో నెటిజన్లు అంటున్నారు. ఇదే తీరున మిగిలిన వారు కూడా తాము చేపట్టిన పనుల గురించి తెలియచేస్తే ప్రజలకు ఒక అవగాహన వస్తుంది అని అంటున్నారు.

## మహిళలకు ఫ్రీ బస్సు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ అధికారులతో దీనిపై సమీక్ష నిర్వహించారు. ఇందులో ఈ ఏడాది ఉగాది లోపు మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అధికారులు వివిధ రాష్ట్రాల్లో ఉచిత బస్సు పథకం అమలవుతున్న తీరును అధ్యయనం చేస్తున్నారు. ఆలోపే నంద్యాల టీడీపీ ఎంపీ, పార్లమెంట్ లో టీడీపీ ఉప నేత కూడా అయిన బైరెడ్డి శబరి ఇవాళ సోషల్ మీడియాలో మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంపై కీలక పోస్టు పెట్టారు. ఇందులో ఆమె మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని సంక్రాంతి నుంచే అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. దీంతో అధికార పార్టీ ఎంపీ పెట్టిన పోస్టు వైరల్ అవుతోంది. ఇప్పటికే కర్నాటక, తెలంగాణ, ఢిల్లీలో అమలవుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఏపీలోనూ అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఉగాది నుంచి అనుకున్న పథకం కాస్తా ముందుకు జరిపి సంక్రాంతి కల్లా అమలుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు బైరెడ్డి శబరి పోస్టుల్ని బట్టి తెలుస్తోంది. ఈ పథకం అమల్లో భాగంగా బస్సుల కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కూడా బైరెడ్డి శబరి తన పోస్టులో వెల్లడించారు. అలాగే ఆటో డ్రైవర్లను దృష్టిలో ఉంచుకుని విధివిధానాలు రూపొందించే పనిలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు శబరి తన పోస్టులో తెలిపారు.

## న్యూఇయర్ గిఫ్ట్..!

రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వాల నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీలోని కోటిమంది కార్యకర్తలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించేలా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఓ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్, ప్రాగ్మ్యాటిక్ ఇన్స్యూరెన్స్ బ్రోకింగ్ ప్రతినిధులు ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశారు. కోటిమంది కార్యకర్తల కోసం ఒకేమారు ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించడం రాజకీయ పార్టీల చరిత్రలో ఇదే ప్రథమం అని చెప్తున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలతో లోకేష్ కుదుర్చుకున్న ఒప్పందం ఈ ఏడాది మొత్తానికి వర్తించబోతోంది. ఇలా కోటిమంది కార్యకర్తల ప్రమాద భీమా కోసం తొలివిడతలో టీడీపీ 42కోట్లు చెల్లించింది. వచ్చే ఏడాది కూడా దాదాపు ఇదే మొత్తంలో ప్రీమియం సొమ్మును పార్టీనే చెల్లిస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం కార్యకర్తలకు ప్రమాదాలు జరిగిన సమయంలో 5లక్షల వరకూ భీమా సొమ్ము లభిస్తుంది. దీంతో కలిపి కార్యకర్తల సంక్షేమానికి ఇప్పటి వరకూ నారా లోకేష్ మొత్తం 138 కోట్లు ఖర్చుచేసినట్లయింది. గత వైసీపీ ప్రభుత్వంలోనే వివిధ ప్రమాదాల్లో దెబ్బతిన్న టీడీపీ కార్యకర్తలను ఆదుకునేందుకు మంగళగిరిలోని కేంద్ర కార్యాలయంలో లోకేష్ ఓ ప్రత్యేక సెల్ ను ఏర్పాటుచేశారు. చనిపోయిన కార్యకర్తల పిల్లల కోసం హైదరాబాద్ తోపాటు కృష్ణాజిల్లా చల్లపల్లిలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటుచేసి ఉచితంగా విద్యనందిస్తున్నారు. కుటుంబ సభ్యుల లాగే పార్టీ కేడర్ ను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు లోకేష్ ప్రయత్నిస్తున్నారు.

## విజయ వంతం చేయాలి

ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా నందు జిల్లా క్రీడా ప్రాధి కార సంస్థ, విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మండల జిల్లా స్థాయిలలో క్రీడా పోటీల నిర్వహణ ఏర్పాట్లు గూర్చి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7 8 9 తేదీలలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రైమరీ స్థాయిలోఅథ్లెటిక్స్ ఈవెంట్స్,తో నిర్వహించి విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతి ప్రధానోత్సవం నిర్వహిం చాలని స్పష్టం చేశారు అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాయిలో అథ్లెటిక్స్ తో పాటుగా కోకో కబడ్డి వాలీబాల్, క్రికెట్, బాస్కెట్బాల్ వెయిట్ లిఫ్టింగ్, బాలికల కొరకు బ్యాడ్మి%శీ%టన్ పోటీలు నిర్వహించడం జరు గుతుందన్నారు. ఈనెల 7, 8 9 తేదీలలో హై స్కూల్ స్థాయిలో నిర్వహించనున్న క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలు ఈనెల 22 23 తేదీలలో స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారన్నా రు. జిల్లా స్థాయి పోటీల లో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలలో గెలుపొందిన విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ బహుకరించడం జరు గుతుందన్నారు. జిల్లా స్థాయి పోటీలు అనంతరం వివిధ శాఖల ఉద్యోగులతో క్రీడా పోటీలను నిర్వహిం చేందుకు యోచన చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పెండింగ్ లో ఉన్న ఐదు ఆట స్థలాల అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయి తీరాజ్ కార్యనిర్వహక ఇంజనీర్ రాజకుమార్ ను ఆదేశించారు. మండల స్థాయిలో క్రీడా పోటీలకు మండల విద్యాశాఖ అధికారి ఎంపీడీవో వ్యాయామ ఉపాధ్యా యులతో ఆర్గనైజింగ్ కమిటీగా నియమించడం జరుగుతుందన్నారు. మండల నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ఈవెంట్ నిర్వహణలో కీలక భూమిక పోషించాల న్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి 22 ఆట స్థలాల వద్ద ప్రాథమిక వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. క్రీడా ప్రాధికార సంస్థ క్రీడామైదానాలను సిద్ధం చేయడంతో పాటు క్రీడా ఎక్విప్మెంట్ కొరకు ప్రతి పాదనలు సిద్ధం చేయా లన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి పాఠశాలల యాజమాన్యాల సహకా రంతో క్రీడాకారులకు భోజ న ఏర్పాట్లు చేపట్టాలన్నా రు. జిల్లా క్రీడా ప్రాధికార అభివృద్ధి సంస్థ అధికారి కలెక్టరేట్ పరిపాలనాది కారి సమన్వయంతో క్రీడా కారులకు టెంట్లు కుర్చీలు త్రాగునీరు బ్యాక్ డ్రాప్ బ్యానరు వేదిక ఏర్పాట్లు క్రీడాకారులకు గుర్తింపు కార్డులు జారీ వంటి కనీసవసతులు కల్పిం చాలన్నారు. వివిధ పాఠశాలల్లోని పబ్లిక్ అడ్రస్ సిస్టం క్రీడా ప్రాంగ ణాల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొత్తం ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా %శీ%తి పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష, జిల్లా క్రీడా ప్రాధికార అభివృద్ధి సంస్థ మరియు ముఖ్య శిక్షకు లు పిఎస్ సురేష్ కుమా ర్, కలెక్టరేట్ ఏవో ఏ కాశీ విశ్వేశ్వరరావు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆర్గనై జింగ్ కార్యదర్శి శ్రీనివా సరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్ ,రవి ,రమణ రావు, మూర్తి తదితరులు పాల్గొ న్నారు.

### ఎనిమిదొందల

## సీసీ కెమెరాల ఏర్పాటు



**ఆకివీడు** : నేరాల సంఖ్యను పూర్తిగా అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నామని, అందులో భాగంగా నియోజకవర్గంలో 800 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. స్థానిక సిఐ కార్యాలయ నూతన భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ పూర్తిస్థాయిలో పని చేసేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తు న్నామన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య భారీగా తగ్గుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని నాలుగు పోలీసు స్టేషన్లకు తన స్నేహితుడు, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సహకారంతో రూ.కోటి విలువైన నాలుగు వాహనాలను అందించామన్నారు. జిల్లాలో పలుచోట్ల సంక్షేమ హాస్టళ్లకు అవసరమైన 400 బెడ్‌లను వారం రోజుల్లో అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి ప్రధాన నీటివనరు పరిమెళ్ల వాటర్ స్కీమ్ మరమ్మతుకు చర్యలు చేపడుతున్నామని, కాల్వల్లోకి మురుగునీరు ప్రవహించకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు. సామాజిక ఆరోగ్య కేంద్రం వెనుక భాగంలో ఉన్న చెత్త డంపింగ్ యార్డ్‌ను ఇప్పటికే సరి చేశామని, త్వరలో ఆ ప్రాంతంలో పార్క్ నిర్మాణం చేపడతామని చెప్పారు. డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసును మూడు రోజుల్లోనే ఛేదించిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని, ఎస్‌పిని అభినందించారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న సిబ్బంది అందరికీ జ్ఞాపికలు అందజేశారు. 6న మంత్రి లోకేష్ భీమవరం రాక ఈ నెల ఆరో తేదీన మంత్రి లోకేష్ భీమవరం రానున్నారని రఘురామకృష్ణంరాజు తెలిపారు. భీమవరం పెదఅమిరం సెంటర్లో ఏర్పాటు చేసిన రతన్‌టాటా కాంస్య విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఉండి జెడ్‌పి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని, చెప్పారు. 7న మంత్రి సత్యకుమార్ ఆకివీడు రాక ఈ నెల ఏడో తేదీన రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆకివీడు రానున్నారని రఘురామకృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌పి అద్నాన్ నయీం ఆస్మీ, ఎఎస్‌పి భీమారావు, ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, టిడిపి మండలాధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్, జనసేన నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు, గవర లక్ష్మి అనిల్, బిజెపి నాయకులు ఎం.నాగమణి పాల్గొన్నారు.

### నరసాపురం-మచిలీపట్నం

## రైల్వేలైన్ డిపిఆర్ సిద్ధం

**నరసాపురం** : నరసాపురం-మచిలీపట్నం మధ్య తలపెట్టిన కొత్త రైల్వేలైన్ పనులకు డిపిఆర్ సిద్ధమైందని, రానున్న బడ్జెట్లో ఈ ప్రాజెక్టుకు నిధులు కూడా విడుదలయ్యే ఛాన్స్ ఉందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం నరసాపురంలోని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజారామ్మోహన్‌నాయుడు నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్ జాప్యానికి నిధులు, భూసేకరణే కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో ఇవ్వాల్సిన వాటా మొత్తంలో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఈ బడ్జెట్లో విడుదలయ్యే నిధులతో ఈ పనులు వేగవంతమవుతాయన్నారు. గత ఐదేళ్ల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటాలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రాల మధ్య మంచి సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. నరసాపురం-వారణాసి మధ్య కొత్త రైలు, నరసాపురం-సికింద్రాబాద్ మధ్య వందేభారత్ రైలు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. త్వరలో భీమవరం-చెన్నరు మధ్య వందేభారత్ రైలు తీసుకొస్తామన్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి రూ.10 కోట్లు కేంద్రం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. ప్రయివేట్ ఏజెన్సీలకు నిర్వహణా బాధ్యతలను అప్పగిస్తామన్నారు. తణుకు, తాడేపల్లిగూడెంల్లోని డయాలసిస్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని శ్మశానవాటికలకు ప్రహరీల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. ముందుగా కేంద్ర మంత్రి వర్మను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, ట్రస్ట్ కోశాధికారి జయలక్ష్మి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్, సంకు భాస్కర్ నాయుడు, బొమ్మిడి సునీల్, గునిశెట్టి రామకృష్ణ, మల్లాడి మూర్తి పాల్గొన్నారు.

## అమలాపురంలో శ్రీ ములగాలు టిఫిన్స్ ప్రారంభోత్సవం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్** : అమలాపురం పట్టణం, ముమ్మిడివరం గేట్ వద్ద నూతన శ్రీ ములగాలు టిఫిన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి యాజమాన్యం ప్రో. పెద్దిరెడ్డి మూర్తి బ్రదర్స్ వారికి శుభాభినందనలు తెలియజేసిన, అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు మరియు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఈ కార్యక్రమంలో అమ్ముడా చైర్మెన్ అల్లాడ స్వామి నాయుడు, చాకూరు గున్నేపల్లి గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భీమా కోరేగావ్ సౌర్య దివస్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్:** భీమా కోరేగావ్ సౌర్య దివస్‌ను బుధవారం కాకినాడలో దళిత ప్రజా సంఘాలు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డాక్టర్ మోకా పావనకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సీనియర్ దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సామాజిక న్యాయ సాధన సమితి నాయకులు డాక్టర్ భానుమతి, కెవిపిఎస్ సీనియర్ నాయకులు మోర్త రాజశేఖర్, కెఎస్.శ్రీనివాస్, దళిత నాయకులు పిల్లి రామారావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాశి బాలయ్య, తాడి బాబ్జి, ప్రజా సంఘాల నాయకులు జి.బేబిరాణి, పి.వీరబా బు, కె.సత్తిరాజు, మలకా రమణ కెవిపిఎస్ నాయకులు కె.సింహాచలం, కె.పద్మనాభం, నేరేడుమిల్లి రాజు, హసన్ షరీఫ్, మహ్మద్ పాల్గొన్నారు.

### లక్ష తులసి పూజ మహోత్సవ
## ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ




**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్** : అంబాజీపేట కొర్లపాటివారి పాలెంలో వేంచేసియున్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 27వ లక్ష తులసి పూజ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈనెల 5న స్వామివారి ఆలయ ప్రాంగణంలో శ్రీ స్వామివారికి వైఖానస ఆగమము ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు పాణంగిపల్లి నర్సింహాచార్యులు పర్యవేక్షణలో కపిలేశ్వరపురం వాస్తవ్యులు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది అవార్డు గ్రహీత, వైఖానస శిరోమణి, సహస్రాధిక ప్రతిష్టాపనాచార్యులు శ్రీమాన్ పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహ చార్యులు బ్రహ్మత్వమున శ్రీ స్వామివారికి వైఖానస ఆగమోక్త ప్రకారంగా లక్ష తులసి పూజ మహోత్సవం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిది శ్రీనివాసరావు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని, ఆలయ ప్రాంతంలో జరిగే అన్న ప్రసాదమును స్వీకరించాలని శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పాణంగిపల్లి నరసింహాచార్యులు, గణపతి వీర రాఘవులు, కొర్లపాటి కోట బాబు, కొర్లపాటి గోపి, మేడిది చిన్న, నైనాల ప్రభాకర్, రవణం రాము, మేడిది బుచ్చబ్బాయి, రవణం హరి, వీరా సతీష్, కొర్లపాటి బాబి, అరిగెల శివ కళ్యాణ్,పరసా సత్తిబాబు, కుప్పాల సీతారామ్, పళ్ళ ఏడుకొండలు,వీరా బుజ్జి, అరిగెల బుజ్జి,కుంపట్ల రాంబాబు,మోటుపల్లి సత్యనారాయణ, కాగితాపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ రథోత్సవ ఉత్సవాలను
## అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలి

**- అర్‌డిఒ కె.మాధవి**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్** : అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ రథోత్సవ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని స్థానిక శాసనసభ్యులు దేవ వరప్ర సాద్ అధికారులకు సూచించారు గురువారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం షెడ్డులో ఏర్పాటుచేసిన ఉత్సవాల సమీక్షా సమావేశం అమలాపురం ఆర్డీవో అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఉత్సవ ఏర్పాట్లుపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ప్రసంగిస్తూ ఫిబ్రవరి 4 నుంచి 13 వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాల్లో అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ ఉత్సవాలను విజయవంతం గావించాలన్నారు. ఉత్సవాల ఏర్పాట్లలో ప్రతి ఒక్కరూ తమ విధులు నిర్వహిస్తూ ప్రతీ భక్తునికి స్వామివారి కల్యాణం తిలకించడంతో పాటుగా స్వామి వారిని దర్శించుకుని సురక్షితంగా ఆధ్యాత్మిక భావం తో ఇంటికి వెళ్లే విధంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఫిబ్రవరి 7 న కల్యాణం, ఫిబ్రవరి 8న రథోత్సవం, ఫిబ్రవరి 12న చక్రస్నానం (సము ద్ర స్నానం,) ఫిబ్రవరి 13న తెప్పోత్సవం వంటి ప్రధాన ఘట్టాలపై సమీక్షించారు. ఆర్డీవో కే మాధవి మాట్లాడుతూ ఉత్సవాలను ఉత్సాహంగా డ్యూటీ కోసం కాకుండా భక్తి సేవా దృక్పథంతో చేయాలని వివిధ శాఖల అధికారులకు ఆమె సూచించారు ఆలయ ప్రాంగణంలో జరిగే కల్యాణం, దర్శనాలకు భక్తులకు ఎక్కడ అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 4 నుంచి ఫిబ్రవరి 13 వ తేదీ వరకు అంగరంగ వైభవం గా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ప్రతి ఏటా మాఘ మాసంశుద్ధ సప్తమి నుంచి బహుళ పాడ్యమి వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, మాఘ శుద్ధ దశమి నాడు స్వామివారి కళ్యాణం, ఏకాదశి నాడు స్వామి వారి రథోత్సవం జరుగు తాయన్నారు.రథోత్సవం సమయంలో పోలీసు బందోబస్తుతో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు వాహనాలు అడ్డు లేకుండా చూడాలన్నారు. చక్రస్నానం, తెప్పోత్సవా ల నిర్వహణలో మత్స్య శాఖ అధికారులు పటిష్ట మైన ఏర్పాట్లు చేయాల న్నారు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విద్యుత్ దీపాలంక రణకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండే లా చర్యలు చేపట్టాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు కొత్తపేట డీఎస్పీ వారు పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య స్వామివారి కల్యాణో త్సవాలను ప్రతిష్టాత్మకం గా నిర్వహించేందుకు సహకారం అందించాలన్నారు పారిశుధ్య చర్యలతోపాటు, వైద్య శిబిరాలు నిర్వహణ ద్వారా భక్తులకు ఏటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. బస్సులు, రోడ్లు, వసతి గదులు తదితర అంశాలపై చర్చించారు. చక్రస్నానం వద్ద భక్తుల సౌకర్యార్థం జల్లు స్నాన ఘట్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతస్థాయి అధికారులు మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు



### ఇంటర్నేషనల్ బెస్ట్ అప్రిసియేషన్
## అవార్డు అందుకున్న జల్లి సుజాత

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్** : ఏలూరులో జరిగిన ఇంటర్నేషనల్ కన్వెన్షన్ లో అమలాపురం మహిళ క్లబ్బులకు అవార్డులు వచ్చిన సందర్భంగా హెల్త్ క్లబ్ అధ్యక్షులు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈరోజు శ్రీ కళా గ్రాండ్ లో జరిగిన సన్మాన సభలో 103 గవర్నగా ఎన్నికైన సప్పా నాగేశ్వరావు ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన గోకరకొండ నాగేంద్ర నీ క్లబ్ సభ్యులు పుష్పగుచ్ఛంతో సాలువాలతో ఘనం గా సన్మానించారు, ఇంటర్ నేషనల్ బెస్ట్ అప్రిసేషన్ అవార్డు అందుకున్న సాయి సంజీవిని మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షరాలు జల్లి సుజాతకి ఇంటర్నేషనల్ బెస్ట్ క్లబ్ అవార్డ్ అందుకున్న మహిళా క్లబ్ అధ్యక్షురాలు బమ్మిడిపాటి పద్మావతికి అవార్డ్స్ మరియు 5000 ప్రైజ్ మనీ గవర్నర్ సప్పా నాగేశ్వరావు ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ నాగేంద్ర క్లబ్ అధ్యక్షులు వరప్రసాద్ చేతుల మీదుగా మహిళా అధ్యక్షులకు అందించి వారిని అభినందించారు ఈ సంవత్సరంలో కూడా మంచి సేవా కార్యక్రమం చేసి అవార్డు అందుకోవాలని వారికి బాధ్యతను గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ సభ్యులందరూ వారినీ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సప్పా నాగేశ్వరావు , నాగేంద్ర సత్య వరప్రసాద్ ఇంటర్నేషనల్ క్లబ్ మాజీ అధ్యక్షులు పిఎస్ శర్మ , ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్

**ప్రజలు అందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని కోరిన ఎమ్మెల్సీ**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్** : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం గ్రామంలోని నల్ల గుంటలో నూతన సంవత్సర సందర్భంగా దేవగుప్తం క్రీస్తు సంఘం వారి ఆధ్వర్యంలో సుమారు 120 మంది మహిళలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రా యిల్, బొమ్మి నరసింహమూర్తి మంగాయమ్మ ట్రస్ట్ ద్వారా పేదలకు, వృద్ధులకు, వితంతువు లకు మరియు సంఘ సభ్యులకు ఖరీదైన 120 చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వారి కుటుంబాలలో ఆ దేవుడు అందరి జీవితాలలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ దైవజనులు ఎలియా రాజు స్థానిక సర్పంచ్ సాధనాల వెంక ట్రావు వైఎస్ఆర్ సీపీ నాయకులు చింతా రామ కృష్ణ, విప్పర్తి ప్రసాద్, విప్పర్తి విజయ్, అయితా బత్తుల నాని, సాధనాల నాగరాజు, ఆకుమర్తి ప్రసాద్, డానియేలు, ఆకుమర్తి సుదర్శన్ మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### సృజనాత్మకతను వెలికి తీసేందుకే
## విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్:** మానవ మనుగడకు విజ్ఞాన శాస్త్రమే మూల మని, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, పరిశోధనా శక్తిని వెలికి తీసేందుకు ఈనెల 4న పి.గన్నవరం మండలం పి గన్నవరం నందు జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలకు పరిమితం కాకుండా ఆలోచనలకు పదును పెడితే వినూత్న మైన ఆలోచనలు సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టే అవకాశం వస్తుంద న్నారు. సుస్థిరమైన భవిష్యత్తు కోసం శాస్త్ర సాంకేతికత, స్వయం ఉపాధి, శాస్త్ర ప్రయోగాల ఉపయోగాలు వంటి ప్రదర్శనలు విద్యార్థుల సృజనాత్మకశక్తిని ప్రతిబింబించేలా నిర్వ హించాలన్నారు. సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టాల న్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ప్రాజెక్టులను తయారు చేయాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులలో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి షేక్ సలీం బాష, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్. సుబ్రహ్మణ్యం ఉపవిద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మండలం విద్యా వనరులు కేద్రంలో ఆదివాసి టీచర్స్
## అసోసియేషన్ 2025 క్యాలెండర్ ఆవిష్కరణ



**కూనవరం, విశ్వం వాయిస్ న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరం మండలంలో స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం కూనవరం నందు ఆది వాసి టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను, స్టిక్కర్ క్యాలెండర్ ను మండల విద్యాధికారి వి వి లక్ష్మినారాయణ, తుర్రం లక్ష్మయ్య చే ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ఎంఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో పాఠశాలలను అందరు గ్రామస్తులు ఎస్ఎంసి సహకారంతో ఏజెన్సీ ప్రాంతం విద్యాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉపా ధ్యాయుల కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి ఆటా జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ సరియం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ అనేది యూనియన్ ఏర్పడిన నాటినుండి నేటి వరకు ట్రైబల్ టీచర్స్ కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు చేసి వారికి రావాల్సిన ఉద్యోగ ఉపాధి నియామకాలు ప్రమోషన్లు వారికి అందేలా చేయడం జరిగిందని తెలియపరిచారు. త్వరలో ప్రకటించే డీయస్సీలో ఏజెన్సీ ప్రాంతాలలో 100% ఏజెన్సీ ప్రాంత ట్రైబల్ అభ్యర్థులతోనే చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయ విద్యా ర్థి నిష్పత్తి 1:20 ఉండేలా పోస్టులు ప్రకటిం చాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో బౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేనందున ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసే విధంగా ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చట్టం వీరయ్య మండల అధ్యక్షులు జితేంద్ర మహిళా కార్యదర్శులు సోడే దుర్గ, పాయల భవాని, సోడే జయమ్మ,మడకం సుజాత కుంజ జితేంద్ర ,బొడ్డు శ్రీను కుంజా సత్యనారాయణ ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఇప్పటికే సేకరించిన భూములను
## స్వాధీనపరుచుకుని రైల్వే శాఖకు అప్పగించండి

**జిల్లా కలెక్టర్ అర్ మహేష్‌కుమార్**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్** : అమలాపురం జనవరి 2: కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ ఆలైన్మెంట్ ప్రతిపాదనల ప్రకారం ఇప్పటికే సేకరించిన భూములను స్వాధీన పరుచుకుని రైల్వే శాఖకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. గురువారం రెవెన్యూ అధికారులతో రైల్వే లైన్ అలైన్మెంట్ భూముల సేకరణ స్వాధీనం, అవార్డులు పాసు, భూ నష్ట పరిహారాలు చెల్లింపు, ఇత్యాది పెండింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సేకరించిన భూములను వెంటనే స్వాధీన పరుచుకుని రైల్వే శాఖ అధికారులకు అప్పగించాలని ఆదే శించారు పెండింగ్ సమస్యలను అధిగ మించే ప్రయత్నంతో పాటుగా త్వరితగతిన భూముల సేకరణ కు చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూసేకరణ ప్రక్రియ ను మరింత సమర్థవంతంగా పూర్తి చేయాల న్నారు ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఇన్చార్జి డిఆర్ఓ కే మాధవి, రెవెన్యూ డివిజనల్ అధికారులు డి అఖిల పి శ్రీఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ సిహెచ్ఎన్వి కృష్ణారెడ్డి, అయినవిల్లి తహసిల్దార్ నాగలక్ష్మి డిటి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు

## ఈశ్వరరావు అరెస్టుపై రాస్తారోకో



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్:** చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ అర్ధాంతరంగా మూసివేసి 409 మంది రోడ్డున పడ్డ కార్మికుల తరపున 47 రోజులుగా పోరాటం చేస్తున్న సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు అక్రమ అరెస్టు నిరసిస్తూ ఏలేశ్వరం బాలాజీ సబ్ సెంటర్లో కార్మికులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషు బాబ్జి మాట్లాడుతూ జీడిపిక్కల ఫ్యాక్టరీని మూసివేయడంతో రోడ్డును పడ్డ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని నిర్వహిస్తున్న ఆందోళనలకు రొంగల ఈశ్వరరావు నాయకత్వం వహిస్తున్నారనే అక్రమ కేసు పెట్టి ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్లో ఉంచారన్నారు. యాజ మాన్యం ప్రజాప్రతినిధులు ఒత్తిడి మేరకు కేసు నమోదు చేశారని, నాయకుడుపై కేసు పెడితే కార్మికులు ఉద్యమాన్ని నిలిపివేస్తారనే కుటిల ప్రయత్నాలు సాగవన్నారు. అక్రమ కేసులకు భయపడేది లేదని ఆయన హెచ్చరించారు. ఉపాధి కోల్పోయిన కార్మికు లకు వెంటనే ఉపాధి కల్పించాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2న జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. అప్పటికి సమస్య పరిష్కారం కాకపోతే ఈ నెల 5న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు, సిఐటియు నాయకులు పిల్ల రాంబాబు, ఎస్‌కె.పద్మ, నెక్కెళ్ల శ్రీను, కొల్లి సతీష్ కుమార్, నిట్ల శ్రీను, జీడి పిక్కల ఫ్యాక్టరీ కార్మిక నాయకులు ఎ.వీరబాబు, చక్రధర్, గోవింద్, ధర్మాజీ, లోవరాజు, అన్నపూర్ణ, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, వరలక్ష్మి, సత్య, చంటి కార్మికులు ఉన్నారు.

# ఎడిటర్ వాయిస్

## రూపాయి విలువ పతనం!

రూపాయి పతనంలో రికార్డుల మీద రికార్డులను బద్దలు కొడుతుంటే ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ మాటా పలుకూ లేకుండా గుడ్లప్పగించి చూస్తున్నది. మోడీ అంటే విశ్వగురువు గనుక ఇలాంటి చిన్న చిన్న విషయాలను పట్టించుకోరని, ప్రపంచ రాజకీయాలను చక్కపెడుతున్నారని అనుకుందాం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర పెద్దలు ఏమయ్యారు? మంగళ వారం రూపాయి విలువ 13 పైసలు పతనమై 85.65 కనిష్ట స్థాయికి దిగజారింది. నరేంద్ర మోడీ గురించి చరిత్రలో ఇప్పటికే అనేక వైఫల్యాలు నమోదయ్యాయి. ఒకసారి చెప్పిన మాట మరోసారి చెప్పరు. వైఫల్యం గురించి వాటి వలన జనానికి కలిగిన ఇబ్బందులకు విచార ప్రకటన లేదు. రూపాయి పతనం గురించి తాను మాట్లాడిన మాటలను జనం మరచిపోయి ఉంటారన్న గట్టి నమ్మకం కారణంగానే మాట్లాడటం లేదు. బిజెపి ప్రచార కమిటీ నేతగా 2014 ఎన్నికలకు ముందు రూపాయి పతనాన్ని కాంగ్రెస్‌పై దాడికి ఒక ఆయుధంగా వాడుకున్నారు. విలువలు-వలువల గురించి నిత్యం తమ భుజాలను తామే చరుచుకొనే సంఘపరివార్‌కు చెందిన వ్యక్తి నుంచి అనేక మంది జవాబుదారీతనాన్ని ఆశించారు, నమ్మారు. వారందరూ కూడా మౌనంగా ఉంటున్నారు, దేశం ఏమై పోతున్నా పట్టని ఈ బలహీనత ఎందుకు? రూపాయి విలువ పతనమౌతుంటే గతంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ ఏమన్నారో తెలుసా! "ఆర్థికం లేదా రూపాయి విలువ పతనం గురించి ప్రభుత్వానికి ఎలాంటి చింత లేదు, తన కుర్చీని ఎలా కాపాడుకోవాలన్నదే దాని ఏకైక ఆందోళన. ఈ కారణంగా దేశం ఈ రోజు ఆశాభంగం చెందింది. గత మూడు నెలలుగా పతనం అవుతున్న రూపాయిని నిలబెట్టేందుకు ప్రభుత్వం ఏ చర్యా తీసుకోలేదు. ఇలా పతనం అవుతుంటే ఇతర దేశాలు దాన్ని అవకాశంగా తీసుకుంటాయి. గడచిన ఐదు సంవత్సరాలుగా ధరలు తగ్గుతాయని, ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుందని ప్రతి మూడు నెలలకు ఒకసారి చెబుతున్నారు తప్ప జరిగిందేమీ లేదు" (2013 ఆగస్టు 20, బిజినెస్ స్టాండర్డ్ పత్రికలో పిటిఐ వార్త). మోడీ ఈ ఆరోపణలు చేసిన రోజు డాలరుకు రూపాయి విలువ 64.11గా ఉంది, తరువాత కొంత మేరకు పెరిగినా గత పదేళ్లలో మొత్తం మీద చూసినపుడు 2024 డిసెంబరు 27వ తేదీ 85.80కు దిగజారింది. పార్లమెంటులో బిజెపికి, దానికి వంత పాడుతున్న పార్టీల బలాన్ని బట్టి 2029 వరకు మధ్యలో అనూహ్య రాజకీయ సంక్షోభం ఏర్పడితే తప్ప ప్రధానిగా మోడీ పదవికి ఎలాంటి ధోకా ఉండదు. పదేళ్ల క్రితం రూపాయి విలువ పతనం గురించి గుండెలు బాదుకొన్న నరేంద్ర మోడీ పదిహేనేళ్లు అధికార వ్యవధిని పూర్తి చేసుకొనే నాటికి 101కి పతనం అవుతుందని ద్రవ్య వ్యాపార నిపుణులు చెబుతున్నారు. రూపాయి పతన చరిత్రను చూసినపుడు ఇంకా ఎక్కువ మొత్తంలో దిగజారేందుకే అవకాశం ఉంది తప్ప బలపడే లక్షణాలు కనిపించటం లేదు. ఈ పతనం కొందరికి మోదం ఎందరికో ఖేదాన్ని తెస్తుంది. ఎగుమతులు చేసే వారికి, విదేశాల నుంచి మన దేశానికి డబ్బు పంపేవారికి సంతోషం కలిగిస్తే, విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే వస్తువుల భారంతో కోట్లాది సామాన్యులకు జేబు గుల్ల అవుతుంది. అమెరికా అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికయిన నవంబరు ఐదున రూపాయి విలువ 84.11 ఉంటే డిసెంబరు చివరి వారంలో ముందే చెప్పుకున్నట్లు 85.65ని తాకింది. జనవరి 20న అధికారాన్ని స్వీకరించే సమయానికి, తరువాత ఏమౌతుందో తెలియదు. రూపాయి విలువ పతనాన్ని అరికట్టేందుకు రిజర్వుబాంకు రంగంలోకి దిగి విదేశీ కరెన్సీ విక్రయాలకు పాల్పడి స్థిరంగా ఉండేట్లు చేస్తుంది. ఇప్పుడూ చేసింది, గతంలోనూ చేసింది, అయినప్పటికీ మొత్తం మీద పతనం ఆగటంలేదు. దేశం వెలిగిపోతోంది అని బిజెపి చెప్పుకున్న వాజ్‌పేయి ఏలుబడిలో 2000 సంవత్సరంలో రూపాయి విలువ 43.35 ఉంది. అది మన్మోహన్ సింగ్ అధికారానికి వచ్చిన 2004లో 45.10, మోడీ పదవీ స్వీకారం చేసిన 2014లో 62.33గా ఉంది. ఇప్పుడు 85.65 దగ్గర ఉంది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినపుడు రూపాయి విలువ డాలరుకు 3.30 ఉంది. మోడీ అధికారానికి వస్తే ఆయనకు ముఖ్యమంత్రిగా ఉన్న అనుభవంతో రూపాయిని 45కు తిరిగి తీసుకు వస్తారని అనేక మంది పండితులు జోశ్యాలు చెప్పారు. గల్లా పట్టుకు అడుగుదామంటే వారెక్కడా ఇప్పుడు మనకు కనిపించరు. మోడీ నోరు తెరవరు. ఎవరు చెప్పినా అంకెల తేడాలున్నప్పటికీ పతనం వాస్తవం. రూపాయి పతనాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌బిఐ చెబుతున్నప్పటికీ ఎలాంటి ఫలితం కనిపించటం లేదు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో డాలరుకు 84 దాటకుండా చూడాలని లక్ష్యంగా చెప్పుకున్నప్పటికీ ఇప్పటికే 86 వరకు రావటాన్ని చూశాం. రోగ నిరోధక శక్తి సన్నగిల్లితే అన్ని రకాల జబ్బులు వస్తున్నట్లు కరెన్సీ విలువ పతనం కూడా ఆర్థిక వ్యవస్థకు అలాంటిదే.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్


# ఆలయాలు సామూహిక జీవన నిలయాలు



రాష్ట్ర రాజకీయాలను మతోన్మాదం చుట్టూ తిప్పేందుకు గత రెండు సంవత్సరాలుగా వేగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత ఎన్నికలకు ముందు నుండే విగ్రహాల ధ్వంసం, రథాల దహనం, దేవాలయాల కూల్చివేత సంఘటనలు అనేకం జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారంలో బిజెపి భాగస్వామ్యం కావడంతో ఈ ప్రయత్నాలు మరింత ముమ్మరం అయ్యాయి. తిరుపతి లడ్డూ వివాదం రాష్ట్రంలోనే కాక దేశంలోనూ, ప్రపంచంలోని భారతీయుల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. లడ్డు కల్తీ గురించి జరిగిన వాదప్రతివాదనల్లో నుండే సనాతన ధర్మం, హిందూ ఆలయాల పరిరక్షణ లాంటి అంశాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లేవనెత్తారు. తానే హిందూ మత పరిరక్షకుడుగా వేషం వేయడమేకాక, ప్రాయశ్చితం పేరుతో కనకదుర్గమ్మ గుడి మెట్లను శుభ్రం చేయడం, తిరుమలకు కాలినడకన వెళ్లడం లాంటి వాటితో రాష్ట్రంలో మత రాజకీయాలను నడిపారు. తాను చేయాల్సిన పనులన్నీ కొత్త స్వాములు తలకెత్తుకున్నందుకు ఆనందిస్తున్న హిందూ మత సంస్థలు ఇందులో తాము వెనకబడకూడదనుకున్నాయేమో దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని జనవరి 5న విజయవాడలో భారీ ప్రదర్శన చేయడానికి సిద్ధమయ్యారు. ఇవన్నీ దేనికది విడివిడిగా జరుగుతున్న సంఘటనలు అనుకుంటే పొరపాటు. వీటన్నింటి వెనుక వున్న శక్తులు, వారి దీర్ఘకాలిక లక్ష్య సాధనలో భాగంగానే ఇవి జరుగుతున్నాయి. తెలుగు ప్రజల జీవనంలో భాగమైన సమైక్యజీవన విధానాన్ని దెబ్బతీసి, మతం, దైవం చాటున మతోన్మాద భావాలను విస్తరింపచేసి రాష్ట్రంలో అధికారాన్ని కబ్జా చేయడం ఈ శక్తుల అంతిమ లక్ష్యం. అందులో ఒక ఎత్తుగడ దేవాలయాల స్వయంప్రతిపత్తి నినాదం. చట్టాల నుండి దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కావాలట! చర్చి, మసీదుల్లో లేని ప్రభుత్వ జోక్యం దేవాలయాల్లో ఎందుకు? దేవాలయాకు వస్తున్న హిందువుల సొమ్ము ఎక్కడెక్కడో ఖర్చు పెట్టడమేమిటి? అంటూ ప్రజలను నమ్మించేందుకు వంచనతో కూడిన వాదనలు చేస్తున్నారు. వీరికి ఏలేవారి అండదండలు పుష్కలంగా వుండడంతో మీడియా, ఇతర మార్గాల్లో సులభంగా ప్రజల మెదళ్ళలోకి ఎక్కిస్తున్నారు. ఈ పన్నాగాన్ని నివారించకపోతే ఆంధ్రావని మరో మతోన్మాద నిలయంగా మారే ప్రమాదం ఉంది. ఆలయమంటే సామూహిక సంఘ స్థలమని 1951లో కంచికామకోటి పీఠం పరమాచార్య శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ఆయన మరింత వివరంగా చెబుతూ 'మన దేవాలయాలు ధ్యానం కోసం లేదా సామూహిక పూజల కోసం మాత్రమే కాదు. ఇల్లు, ఆహారం, వస్త్రాలు, ఆభరణాలు, సంగీతం, నృత్యం మొదలైన జీవిత విధానాలను సామూహికంగా నివేదించే స్థలమ'న్నారు. అందుకనే దేవాలయాలు సమిష్టి జీవన విధాన గుర్తులు. భారతదేశం అనాదిగా దేవాలయాల భూమిగా కీర్తించబడింది. మొత్తం సృష్టిని పరమాత్మ అవతారంగా భావించి, రోజువారీ జీవితంలో ఆత్మ (మనిషి) పడుతున్న బాధలు, ఎదుర్కొంటున్న కష్టాలను, సాధించాలనుకుంటున్న కోర్కెలను పరమాత్మ (శక్తి)కు చెప్పుకునే నిలయాలుగా దేవాలయాలను భక్తులు భావిస్తున్నారు. ఈ ఆలయాలు ప్రతి ఒక్కరినీ పవిత్రం చేస్తాయని, ఆ పరమాత్మ అన్ని జీవుల పట్ల అనంతమైన ప్రేమను, దయను కలిగి వుంటాడని విశ్వసిస్తున్న ప్రజలు ఆలయ విగ్రహాన్ని దర్శించడం, పూజలు చేయడం జరుగుతుంది. అయితే గొప్ప తీర్థ క్షేత్రాలుగా వున్న ఆలయాలన్నీ ప్రకృతి సహజ సంపదగా ఉన్న నదులు, పర్వతాలు, అడవుల్లో ఉండడం ద్వారా మనిషికి, ప్రకృతికి వున్న జీవన సంబంధాన్ని చాటిచెబుతున్నాయి. జంతువుల నుండి వేరుపడిన మనిషి ప్రకృతిలో తనకంటే బలమైన గాలి, నీరు, నిప్పు, వెలుతురు, చీకటి ఇలా అనేకం తెలుసుకునే క్రమంలో వాటిని ఆదరించడం ప్రారంభించాడు. ప్రకృతి శక్తులను అతీత శక్తులుగా భావించి వీటిని అదుపులో తెచ్చుకోవడం కోసం మంత్రాలు, క్రతువులు, పూజలు చేశారు. తమ జీవనానికి వేట ప్రధాన ఆధారం కనుక తాము పూజించే శక్తిమూర్తులకు వేట ఆయుధాలను జత చేసి పూజించారు. క్రమంగా రాజ్యాలు ఏర్పడడంతో ఘర్షణలు, యుద్ధాలు పెరిగాయి. ఆ క్రమంలో యుద్ధ ఆయుధాలను కలిగిన దేవతా విగ్రహాలు ఏర్పడ్డాయి. రాజులు తమ పాలన గుర్తుగా, యుద్ధ విజయ చిహ్నంగా భారీ ఆలయాలు నిర్మించారు. ఈ ఆలయాల్లో పూజలు, క్రతువులు నిర్వహించడానికి పౌరోహితులు, వారికి సేవలందించడానికి ఆయగాళ్ళు (పోషకులు), వీరందరిని పోషించడానికి మాన్యాలు (భూములు) అవసరం ఏర్పడింది. దేవాలయాలతోపాటు పూజా పద్ధతులు, మతాచారాలు, పండుగలు, ఉత్సవాల లాంటి సామూహిక జీవన వ్యవస్థ ఏర్పడింది. రాజుల పోషణతో నిర్వహించబడే దేవాలయాలు ప్రముఖ క్షేత్రాలుగా వర్ధిల్లాయి. సమాజం ఉమ్మడిగా సృష్టించిన అద్భుత పరిజ్ఞానంలో ఎక్కువ భాగం ఈ దేవాలయాల నిర్మాణంలో, రాజుల భవంతులు, కోటల నిర్మాణంలో ఉపయోగించ బడింది. క్రమంగా హిందూ మతంలో శైవులు, వైష్ణవుల లాంటి అనేక ఉపశాఖలు తమ ఆధిపత్యపోరు రాజుల మధ్య యుద్ధాలుగా, ఆ సందర్భంగా ఆలయాల నిర్మాణం, విధ్వంసం యథేచ్ఛగా సాగాయి. కీర్తిగాంచిన దేవాలయాలు సంపద నిలయాలుగా మారడంతో దండయాత్ర చేసినవారు ఇక్కడ నిల్వ వున్న బంగారు, వెండితో పాటు, విలువైన విగ్రహాలను దొంగలించుకు పోయేవారు. ఆ సందర్భంలో దేవాలయాలు, విగ్రహాల విధ్వంసమూ సాగింది. బ్రిటీష్‌వారు వచ్చిన తర్వాత భూస్వామ్య రాజరికపు వ్యవస్థ బలహీన పడడంతో ఈ ఆలయాల నిర్వహణ ఎవరు చేయాలనే సమస్య వచ్చింది. 1820లో బ్రిటీష్ ప్రభుత్వం మద్రాసు ప్రెసిడెన్సీలోని వివిధ జిల్లాల్లోని కలెక్టర్లను వారి జిల్లాల్లోని మతపరమైన సంస్థల సంఖ్య మరియు వాటి స్థితిగతులపై నివేదించమని కోరినప్పుడు, ప్రెసిడెన్సీలోని ఇరవై జిల్లాల్లో లక్షకు పైగా దేవాలయాలు, ఛత్రాలు, గణితాలు వున్నట్లు, 3 జిల్లాల్లో దాదాపు 300 నుండి 400 వరకు ప్రధాన ఆలయాలు ఉన్నట్లు నివేదించబడిందని ప్రముఖ పరిశోధకులు శ్రీనివాస్ తన పరిశోధనా గ్రంథం 'హిందూ దేవాలయాలు, వాటి భావన, చరిత్ర, వారసత్వం'లో పేర్కొన్నారు. హిందూ దేవాలయాల నిర్వహణను బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టి, చట్టాలను రూపొందించింది. 1833 నాటికి మద్రాసు ప్రెసిడెన్సీలో 7,600 దేవాలయాలను ఈ చట్టాల ద్వారా ప్రభుత్వం నేరుగా నిర్వహించింది. అప్పటి వరకు రాజుల స్వంత ఆస్తిగా వున్న దేవాలయాలు ఇలా ప్రభుత్వ చట్టాల పరిధిలోకి వచ్చాయి. స్వాతంత్ర్యానంతరం సహజంగానే దేవాలయ నిర్వహణ ప్రజాస్వామ్య ప్రభుత్వం చేపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25(1) మత స్వేచ్ఛను ఇస్తుంది. అలాగే ఆర్టికల్ 25(2) మత వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుని చట్టాలు చేసే లేదా మతపరమైన సంస్థలను నియంత్రించే విధానం గురించి చెబుతుంది. షెడ్యూల్ 7లోని జాబితా మూడులో 28వ భాగం 'కేంద్రం మరియు రాష్ట్ర శాసనసభలు రెండింటికి ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలపై చట్టం చేయడానికి అధికారం ఇచ్చింది. హిందూ మత, ధర్మాదాయ శాఖ (హెచ్‌ఆర్‌సిఇ) చట్టం (1959) ప్రకారం పూజ పద్ధతులు, సాంప్రదాయాల్లో జోక్యం కాకుండా దేవాలయ ఆర్థిక నిర్వహణ, ఆలయ ఆస్తుల నిర్వహణ, నిధుల వినియోగంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకునే వీలు కల్పించబడింది. 1960లో ఏర్పడిన హిందూ రెలిజియస్ ఎండోమెంట్స్ కమిషన్ ఆలయాల నిర్వహణలో అక్రమాలు, అవినీతి లేకుండా చూడడానికి, అవి అలౌకిక, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించకుండా వుండడానికి ప్రభుత్వ నియంత్రణ తప్పనిసరి అని ఈ కమిషన్ భావించింది. అప్పటివరకు మతం పేరుతో సమాజంలో బలులు, మూఢవిశ్వాసాలు, కులం పేరుతో కుల వివక్ష లాంటి అనాగరిక చర్యలను నియంత్రించి దేవాలయాల ప్రారంభం నాడు వున్న స్ఫూర్తికి అనుగుణంగా వాటిని సామూహిక ప్రజా నిలయాలుగా మార్చాలని రాజ్యాంగ నిపుణులు భావించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఒడిస్సా రాష్ట్ర ప్రభుత్వాలు ఆలయాల నిర్వహణను పర్యవేక్షించేందుకు అనుమతించే 1959 నాటి చట్టానికి అనుగుణంగా రాష్ట్ర చట్టాలు రూపొందించుకున్నాయి. వీటి ఆధారంగా ఆలయ ధర్మకర్తలు, కార్యనిర్వాహక అధికారులు, ఇతర పాలనా సిబ్బందిని ప్రభుత్వాలు నియమిస్తాయి. ఆలయాల నిర్వహణలో ప్రభుత్వ జోక్యం వుండకూడదని విమర్శించేవారు ప్రధానంగా ఆలయ ఆదాయం, వాటి ఖర్చు తీరుపై వివాదం చేస్తున్నారు. దేవాలయాల ఆదాయాన్ని ఇతర కార్యకలాపాలకు మళ్లిస్తున్నారని, వాటికి స్వయంప్రతిపత్తి ఇవ్వాలని కోర్టులను ఆశ్రయించారు. 1954లో షిరూర్ మఠం కేసు మొదలుకొని ఇటీవల వరకు ఆలయ నిర్వహణలోని లౌకిక అంశాలను పరిరక్షించడానికి ప్రభుత్వాలు జోక్యం చేసుకోవచ్చని, పూర్తిగా మతపరమైన విషయాల్లో జోక్యం చేసుకోవద్దని అనేక కేసుల్లో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చింది. దేవాలయాలు సామూహిక ప్రజా నిలయాలు కనుకే వీటి నిధులలో కొంత భాగాన్ని విద్య, ఆరోగ్య, సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయడానికి చట్టాలు అనుమతించాయి. అలాగే దేవాలయాలు సమాజంలోని అన్ని వర్గాలకు సేవలందించేలా ఏ ఒక్కరికో, కొందరికో ఈ ఆదాయాల మీద ఆధిపత్యం వుండకూడదనే భావనతోనే ప్రభుత్వ జోక్యం అవసరమైంది. అగ్ర కులాలు, నిమ్న కులాలనే కుల ఆధిపత్యాన్ని దేవాలయాల్లో అరికట్టేందుకు, దేవాలయాలు సమాజంలోని బహుళత్వాన్ని, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వ జోక్యం తప్పనిసరి. ఆలయాల అర్చకుల నియమాకంలో కులానికి ఎలాంటి పాత్ర ఉండదని, ఆ వ్యక్తి ఆలయానికి సంబంధించిన ఆగమ సూత్రాలపై ప్రావీణ్యం కలిగి ఉండాలని మద్రాసు హైకోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. కేరళ వామపక్ష ప్రభుత్వం పూజ ప్రావీణ్య పద్ధతుల నైపుణ్యం ఆధారంగా దళితులు, వెనుకబడిన కులాల వారిని పూజారులుగా నియమించింది. మసీదులు, చర్చిలు ఒక పరిమిత ప్రాంతంలో నివాసం వుండే వారు ఏర్పాటు చేసుకునే ప్రార్ధనా మందిరాలు. వీటిని ప్రభుత్వ రిజిస్టర్ ద్వారా చట్టబద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని చట్టాలు వున్నాయి. వీటి నిర్వహణ రాజ్య నియమ నిబంధనలకు లోబడే వుండాలి. వీటిల్లో వచ్చే ఆదాయ, ఇతర నిర్వహణ సమస్యలను న్యాయ చట్టాల ప్రకారమే ప్రభుత్వాలు, న్యాయస్థానాలు పరిష్కరిస్తున్నాయి. వీటిని మరింత ప్రజాస్వామ్యయుతంగా నడపడానికి ఈ చట్టాల్లో, నియమ నిబంధనల్లో మార్పులు రావాలని కోరడం వేరు, ఆలయాల స్వయంప్రతిపత్తి పేరుతో తరాల నాటి భూస్వామ్య రాజరిక, బ్రాహ్మణీయ వ్యవస్థ తిరిగి కావాలనడం వేరు. ఇప్పుడు ఆలయాల స్వయంప్రతిపత్తి కోరుతున్న సంస్థలు నాటి పాత రాజరిక వ్యవస్థను పునరుద్ధరించాలని, మనువాద సిద్ధాంత ఆధారంగా చాతుర్వర్ణ వ్యవస్థ వుండాలని కోరుకునే పాత తరం ప్రతినిధులు. వీరు చేసే ఈ తిరోగామి మార్గం వైపు సమాజం వెళ్లకుండా నిరోధించడం ప్రతి భారతీయుడి కర్తవ్యం.

# అరవై ఆరేళ్ల క్యూబా సోషలిస్టు విప్లవం!

క్యూబా సోషలిస్టు విప్లవం 66వ ఏడాదిలో ప్రవేశించింది. 1953 జులై 26న నియంత బాటిస్టా పాలనకు వ్యతిరేకంగా ప్రారంభమైన తిరుగుబాటు%౮%1959 జనవరి ఒకటిన విప్లవోద్యమ నేత ఫైడెల్ కాస్ట్రో అధికారానికి రావటంతో ముగిసింది. ఐదు సంవత్సరాల ఐదు నెలల ఐదవ రోజు 1958 డిసెంబరు 31న బాటిస్టా ప్రభుత్వాన్ని కూల్చివేశారు. 1959 జనవరి ఒకటిన కాస్ట్రో అధికారానికి వచ్చాడు. జులై 26 ఉద్యమం పేరుతో ఉన్న వారు కీలక పాత్ర పోషించారు. తరువాత మార్క్సిజం-లెనినిజాన్ని ఆమోదించి 1965 అక్టోబరులో క్యూబా కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. అయితే విప్లవంలో కీలక ఘట్టమైన జులై 26వ తేదీని విప్లవ దినంగా పరిగణించారు. విప్లవాన్ని మొగ్గలోనే తుంచి వేసేందుకు వెంటనే అమెరికా ఆర్థిక దిగ్బంధనాన్ని ప్రారంభించి, క్రమంగా తీవ్రతరం కావించింది. నాటి నుంచి నేటి వరకు అక్కడ రిపబ్లికన్ పార్టీ-డెమోక్రటిక్ పార్టీ ఎవరు అధికారంలో ఉన్నా మానవాళి చరిత్రలోనే అత్యంత సుదీర్ఘ దిగ్బంధనం కొనసాగుతూనే ఉంది. అమెరికాకు క్యూబా కూత వేటు దూరంలో ఉంది. రెండు దేశాల సమీప భూభాగాల మధ్య దూరం కేవలం 90 మైళ్లు (145 కిలోమీటర్లు) మాత్రమే. కరీబియన్ సముద్ర మెక్సికో అఖాతం, అట్లాంటిక్ మహా సముద్రం కలిసే ప్రాంతంలో ఉన్న కోటి 12 లక్షల జనాభాతో ప్రధాన భూభాగానికి అనుబంధంగా 4,195 చిన్నా, పెద్ద దీవులు ఉన్న దేశం. అన్ని రకాల దిగ్బంధాలతో అక్కడి జనాన్ని మాడిస్తే వారు తిరుగుబాటు చేసి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేసి తమ ఒడిలో కూర్చుంటారని 65 ఏళ్లుగా అమెరికా చూస్తున్నది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అగ్ర రాజ్యానికి తలొగ్గకుండా ఆత్మగౌరవంతో పితృదేశమా (కొన్ని దేశాలు పితృసామిక వ్యవస్థను అనుసరించి అలా పిలుచుకుంటాయి. దేశభక్తిలో ఎలాంటి తేడా ఉండదు) లేక మరణమా అన్న ఆశయంతో ముందుకు సాగుతున్నది. గత పాతికేళ్లలో 120 దేశాలకు చెందిన వారు 31,180 మంది వైద్యులుగా తయారు కాగా ప్రస్తుతం 1,800 మంది విద్యార్థులున్నారు. హవానాకు పశ్చిమంగా ఉన్న నౌకా కేంద్రాన్ని కాలేజీగా మార్చారు. మొదటి రెండు సంవత్సరాలు అక్కడ ఆసుపత్రులతో అవసరం లేని బోధన చేస్తారు. నాలుగు సంవత్సరాల పాటు క్యూబాలోని బోధనా ఆసుపత్రులలో శిక్షణ ఇస్తారు. మూడంచెల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో భాగంగా 69 వైద్య ప్రత్యేక చికిత్స కేంద్రాలు, 149 ఆసుపత్రులు, 451 పాలి క్లినిక్‌లు, 11,315 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో నాలుగు లక్షల మంది




సిబ్బంది పని చేస్తున్నారు. ప్రతి వెయ్యి మందికి (మొత్తం 80 వేల మంది) ఒక వైద్యుడు లేదా వైద్యురాలు ఉన్నారు. పదమూడు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. 2,767 వైద్య పరిశోధనా ప్రాజెక్టులు, 82 క్లినికల్ ప్రయోగాలు నడుస్తున్నాయి. 160 దేశాలలో 6 లక్షల మంది క్యూబన్లు వైద్య సేవలు అందిస్తున్నారు. క్యూబా సర్కార్ జనానికి అందిస్తున్న సబ్సిడీ ఆహార పథకాన్ని అదిగో రద్దు చేస్తున్నారు ఇదిగో రద్దు చేస్తున్నారంటూ గత రెండు దశాబ్దాలుగా అమెరికా, దాని ఉప్పు తింటున్న మీడియా కథనాలు రాస్తూనే ఉంది. కొన్ని సందర్భాలలో దుర్వినియోగం జరిగినపుడు పథకాన్ని సవరించటం గురించి మాట్లాడారు తప్ప ఎత్తివేత గురించి కాదు. సోవియట్, ఇతర తూర్పు ఐరోపా సోషలిస్టు రాజ్యాలు కూలిపోయిన తరువాత క్యూబా అనేక తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్న మాట నిజం. అవి ఉనికిలో ఉన్నపుడు కూడా ఉన్నదేదో కలసి తింటాం లేకుంటే కాళ్లు ముడుచుకు పడుకుంటాం తప్ప అమెరికా ముందు చేయి చాచం అని ఫైడెల్ కాస్ట్రో దశాబ్దాల క్రితమే చెప్పారు. దానిలో భాగంగానే ఆహార సబ్సిడీ-పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. దాన్నే రేషన్ బుక్ అని పిలుస్తున్నారు. ప్రతి ఏటా ఒక పుస్తక రూపంలో కూపన్లు ఇస్తే దుకాణాల్లో వాటితో సరకులు తీసుకుంటారు. 1962 నుంచి ఈ పథకం అమల్లో ఉంది. ప్రతి ఒక్కరికీ ప్రతి నెలా బియ్యం, బీన్స్, బంగాళాదుంప, అరటికాయలు, బఠాణీ గింజలు, కాఫీ, వంటనూనె, గుడ్లు, మాంసం, కోడి మాంసం, పిల్లలకు పాలు సరఫరా చేస్తున్నారు. ఈ మధ్య పోషకాహార లేమి వలన క్యూబాలో మరణాల రేటు 2022 నుంచి 2023కు 74.42 శాతానికి పెరిగిందంటూ కొన్ని పత్రికలు పతాక శీర్షికలతో వార్తలను ఇచ్చాయి. అక్కడ సంభవిస్తున్న మరణాలకు కారణాలలో పోషకాహార లేమి ఇరవయ్యవదిగా ఉంది. ఇంతకూ పైన పేర్కొన్న సంవత్సరాలలో మరణించిన వారి సంఖ్య 43 నుంచి 75కు పెరిగింది. కోటి మంది జనాభా, అష్టకష్టాలు పడుతూ, 80 శాతం ఆహారాన్ని దిగుమతి చేసుకుంటున్న అక్కడ మరణాలు అవి. ప్రపంచానికి ఆహారాన్ని అందచేసే స్థితిలో ఉన్నామని మన ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన మన దేశంలో 140 కోట్ల జనాభాలో పోషకాహార లేమి కారణంగా ఎందరు మరణిస్తున్నారో తెలుసా! హిండ్‌రైజ్ డాట్ ఓఆర్‌జి సమాచారం ప్రకారం మన దేశంలో రోజుకు ఏడు వేల మంది మరణిస్తున్నారు. ఐదేళ్ల లోపు వయస్సున్న పిల్లల మరణాలలో 69 శాతం పోషకాహార లేమి కారణమని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా సుప్రీం కోర్టుకు 2022లో తెలిపింది. మన దేశంలో ఆహార భద్రతా చట్టం అమల్లో ఉంది. దానిలో భాగంగా 80 కోట్ల మందికి గతంలో సబ్సిడీ బియ్యం లేదా గోధుమలు ఇవ్వగా ఇప్పుడు ఉచితంగా ఇస్తున్నారు. అయినా మన దేశం 2024 ప్రపంచ ఆకలి సూచిక 127 దేశాలలో 105వదిగా ఉంది. పదేళ్ల అచ్చే దిన్‌లో ఆకలి తీవ్రంగా ఉన్న దేశాల సరసన మన దేశాన్ని ఉంచిన ఘనత విశ్వగురువు నరేంద్ర మోడీకి దక్కింది. వరల్డ్ పాపులేషన్ రివ్యూ డాట్ కామ్ సమాచారం ప్రకారం 171 దేశాల జాబితాలో మన దేశంలో పోషకాహార లోపం ఉన్నవారు 2011లో 18.35 కోట్ల మంది ఉంటే, 2023లో 19.46 కోట్ల మందికి పెరిగారు. నిజానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువ. పోషకాహార లేమి నామమాత్రంగా ఉన్నప్పటికీ ఆయా దేశాలలో 2.5 శాతం మంది ఉన్నట్లు లెక్కిస్తారు. అలాంటి దేశాల జాబితాలో చైనా, క్యూబా ఇంకా అనేక దేశాలు ఉన్నాయి. మన దేశంలో పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ దాన్ని గుర్తించటానికి మోడీ సర్కార్ ససేమిరా అంటున్నది. క్యూబా ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారటానికి, ఇతర సమస్యలకు కారణం అమెరికా విధించిన ఆర్థిక దిగ్బంధనమే. ఆంక్షలను తొలగించాలని ప్రతి ఏటా ఐరాసలో తీర్మానం పెట్టటం, అమెరికా, దాని తొత్తు ఇజ్రాయిల్ వ్యతిరేకించటం మిగిలిన దేశాలన్నీ సమర్ధించటం తెలిసిందే. అయితే ఐరాస సాధారణ అసెంబ్లీ తీర్మానాలకు పూచికపుల్ల పాటి విలువ కూడా లేదు. వాటిని ధిక్కరించిన దేశాలను చేసేదేమీ లేదు. అమెరికా దిగ్బంధనం వలన ప్రపంచంలో మరో దేశమేదీ క్యూబా మాదిరి నష్టపోవటం లేదు. ఎందుకు ఇలా జరుగుతోంది? ప్రపంచ మంతటా కమ్యూనిజాన్ని అరికడతానంటూ బయలు దేరిన అమెరికన్ పాలకులకు తమ పెరటితోట వంటి క్యూబాలో కమ్యూనిస్టులు అధికారంలో ఉండటం అవమానకరంగా మారింది.



## మత్స్యకారులకు నష్టపరిహారం పంపిణీ

**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓఎన్‌జిసి సంస్థ నుంచి మత్స్య కారులకు విడుదలైన నష్ట పరిహారం పంపిణీ కార్య క్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు జరగనున్నట్లు ఎంఎల్ఏ దాట్ల సుబ్బరాజు తెలిపారు. పంపిణీ కార్యక్రమం సందర్భంగా నిర్వహించే సభకు సంబంధించిన ఏర్పాట్లును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నష్టపరిహారంలో భాగంగా రూ.148.37 కోట్లను ఆయా లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం శుక్రవారం జమ చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని 4 మండలాలతో పాటు, కొత్తపేట మండలాలకు చెందిన 23,458 మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరుందని తెలిపారు.



## గేమ్ చేంజర్ ఈవెంట్ పనులకు శ్రీకారం

**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** సుప్రసిద్ధ తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న "గేమ్ చేంజర్" సినిమా ఫ్రీ రిలీజ్ ఈవెంట్ రాజమహేంద్రవరం సమీపాన కడియం మండలం వేమగిరి నందు జాతీయ రహదారిని ఆనుకుని వున్న ప్రైవేట్ మైదానం లో జరగనుంది. ఈ నెల 4న ఈ వేడుక నిర్వహించడానికి పనులకు మెగా అభిమానులు శ్రీకారం చుట్టారు. ఈగేమ్ చేంజర్ సినిమా తూర్పు గోదావరి పరిసర ప్రాంతాల్లో అధికంగా తీశారు. అంతేగాక గ్రామీణ ప్రాంతంలో ఈ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించడానికి చిత్ర యూనిట్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. ఈ ఈవెంట్ కు హీరో రామ్ చరణ్, దర్శకుడు శంకర్‌తో పాటు మెగాస్టార్ చిరంజీవి, సినీ, రాజకీయ ప్రముఖులు, మెగా ఫ్యామిలీ విచ్చేయనున్నట్లు తెలుస్తుంది.



# వికలాంగ పింఛన్లు తనిఖీ ప్రక్రియ

# నూటికి నూరు శాతం కచ్చితత్వంతో నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ అర్.మహేష్‌కుమార్

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా వికలాంగ పింఛన్లు తనిఖీ ప్రక్రియ మార్గదర్శకాలు ప్రకారం నూటికి నూరు శాతం కచ్చితత్వంతో నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారుల ఆదేశించారు. గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం టి కృష్ణ బాబు పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో జి వీర పాండ్యన్ లు అమరావతి నుండి 26 జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించి ఎన్టీఆర్ భరోసా వికలాంగ పింఛన్ల తనిఖీ ప్రక్రియ విధివిధా నాలపై దిశా నిర్దేశం చేశారు ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లలో అనర్హులు పింఛన్ పొంద కుండా అర్హులకు మాత్రమే చేరేలా తనిఖీ ప్రక్రియను చేపట్టిందన్నారు ఆ దిశగా ముందుగా డోర్ టు డోర్ తనిఖీ రెండో దశలో ఆసుపత్రులు తనిఖీ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వికలాంగత మరియు ఆరోగ్యంపై రీ అసెస్మెంట్ ఆఫ్ హెల్త్ తనిఖీ పారదర్శకంగా జవాబు దారితనంతో నిర్వహిం చాలన్నారు జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ మార్గదర్శకాలకు డిఆర్డిఏ పిడి కన్వీనర్ గా నియమించాల న్నారు. చెవిటి మూగ మానసిక కంటిచూపు వికలాంగత్వాలను పనికి బృందాలు ద్వారా వెరిఫికేషన్ యాప్ లోనూ భౌతికంగా రూపొందించిన ప్రశ్నావళి లోను నింపుతూ ఆన్లైన్ చేసి సదరన్ పోర్టల్లో తనిఖీ నిర్వహించాలని



ఆదేశిం చారు నింపిన ప్రశ్నావళిని సంబంధిత పీహెచ్ ద్వారా డిఎం అండ్ హెచ్ ఓ వారికి ఏరోజుకారోజున సమర్పించాలన్నారు బృందంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ వెరిఫికేషన్ యాప్ లో వివరాలు ఖచ్చిత త్వంతో నింపాలని ఆదేశించారు. వారం రోజులు మూడు రోజులు తనిఖీ ప్రక్రియ నిర్వహించే దిశగా ప్రణాళికలు రచించాలన్నారు. తనిఖీ బృందంలో ఎముకలు, తదితర వైద్య నిపుణులు ఉంటారన్నారు జిల్లావ్యా ప్తంగా సుమారు 500 మంది వికలాంగులకు మార్గద ర్శకాల ప్రకారం తనిఖీ నిర్వహించాల్సి ఉందని కోనసీమ జిల్లాలో ఒక్కొక్క నియోజకవ ర్గానికి ఒక్కొక్క వైద్య బృందాన్ని కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇతర వైద్య నిపుణుల సహకారంతో బృందాలను నియమిం చాలని సూచించారు. ముం దస్తుగా పింఛన్ల తనిఖీకి సంబంధించి షెడ్యూలను రూట్ మ్యాప్ తో సహా రూపొం దించాలన్నారు. ఏ ఏ గ్రామాలను సందర్శిస్తారో ఒకరోజు ముందుగా సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసే మార్గ దర్శకాలను తప్పనిసరిగా ఆచరిస్తూ తనిఖీ ప్రక్రియ ను నూటికి నూరు శాతం విజయవంతం చేయాలని ఆదేశించారు. తనిఖీ అనంతరం జిల్లా కలెక్టర్ స్థాయిలో యాదృచ్ఛి కంగా 10 శాతం విక లాంగ ఎన్టీఆర్ భరోసా భద్రత పింఛన్లను తనిఖీ చేయడం జరుగుతుందని తనిఖీలలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే సంబంధిత టీం పై చర్య లు ఉంటాయని ఆయనే సందర్భంగా హెచ్చరించా రు. డి సి హెచ్ ఎస్ డిఎం అండ్ హెచ్ ఓ సమన్వ యంతో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత వికలాంగ పింఛన్లు తనిఖీని అత్యంత పటిష్టంగా నిర్వ హించాలని ఆదేశిం చారు. డిఆర్డిఏ పిడి ముందుగా కార్యాచరణను రూట్ మ్యాప్ లతో సహా రూ పొందించాలని ఆదేశించారు. జి ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డినేటర్ 7 మంది డిజిటల్ అసిస్టెంట్లను బృం దాలలో నియామకం కొరకు వెరిఫికేషన్ యాప్ పై తర్ఫీదును ఇచ్చి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి డాక్టర్ వి శివశంకర్ ప్రసాద్ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎం దుర్గారావు దొర, డి సి హెచ్ ఎస్ డాక్టర్ కార్తీక్ రెడ్డి, డిపిఓ శాంత లక్ష్మి జి ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డినేటర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ నాయకులందరూ

## పుస్తక పాఠకులే : జెఎన్‌టియుకె విసి



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ నాయకులందరూ గొప్ప పుస్తక పాఠకులనేని జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి విసి కెవిఎస్‌డి.మురళీకృష్ణ అన్నారు. జెఎన్‌టియుకె ప్రాంగణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసి ఫ్రీబుల్ ద బుక్ బఫే కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. యుసిఇకె ప్రిన్సిపల్ ఎన్. మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముక్యఅతిథిగా, గౌరవ అతిథులుగా రెక్టార్ కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఒఎస్‌డి డి.కోటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఫ్రాన్స్ దేశంలోని ఓపెన్ లైబ్రరీని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పేస్ బుక్ కు అలవాటుపడిన విద్యార్థులు పుస్తక పఠనాన్ని విస్మరిస్తున్నారన్నారు. పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజలు, నగర ప్రముఖులు, అధ్యాపకులు అందజేసిన సాధారణ, సాంకేతిక పుస్తకాలను సెంట్రల్ లైబ్రరీ రీడింగ్ రూమ్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. అనుబంధ కళాశాలల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టేలా చర్యలు చేపడతామన్నారు. రెక్టార్ రమణ మాట్లాడుతూ ఏదైనా అంశం గురించి తెలుసుకోవాలంటే లైబ్రరీకి వెళ్లకుండా స్మార్ట్ ఫోన్లపై ఆధారపడుతున్నారన్నారు.

### ఆకట్టుకున్న మండల స్థాయి

## వైజ్ఞానిక ప్రదర్శనలు



**పుల్లేటికుర్రు, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో పలు చోట్ల మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలువురిని జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికచేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్లో 10 ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. మండల అధ్యక్షులు పంపన నాగమణి దీనిని ప్రారంభించారు. వ్యక్తిగత భాగంలోనూ బృంద విభాగంలోనూ టీచర్ విభాగంలోనూ పోటీలు జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శించిన అంశాలు అందర్నీ ఆకట్టుకుట్టుకునేల వున్నాయి. విజేతలకు బహుమతు అందజేశారు. జిల్లా స్థాయికి మొదటి రెండు స్థానాలు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు సైన్స్ కన్వీనర్ పి.వీర బ్రహ్మానందంవెల్లడించారు. గ్రామ సర్పంచ్ కోటివెంకటనరసాయమ్మ ,గ్రామ పెద్దలు నేమాని సత్తిబాబు అల్లూరి దొరబాబు, చిర్రా రాజకుమార్, పెంటపాడు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎన్‌వి.రమణ, నరాల కష్ణకుమార్, దాసరి శ్రీనివాసు, ఎంఇఒలు అలీజింగి నాగరాజు, సిహెచ్ ఆంజనేయులు పాల్గొన్నారు. వ్యెక్తిగత విభాగంలో జడ్‌పిహెచ్‌ఎస్ పామర్రు విద్యార్థులు తయారుచేసిన యాంటీ స్లీప్ అలారం మొదటి స్థానం లో నిలిచింది. దంగేరు విద్యార్థులు తయారుచేసిన జెసిబి రెండో స్థానంలోనూ, బందవి భాగంలో జడ్‌పిహెచ్‌ఎస్ గంగవరం వారు చేసిన నెత్తిమీద బరువులు పెట్టుకుని సులువుగా మోయగల సాధనము మొదటి స్థానంలోనూ, సుందరపల్లి విద్యార్థులు చేసిన ఆటోమెటిక్ ప్లాంట్ వాటర్ సిస్టం రెండు స్థానంలో నిలిచాయి. వీటిని జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలను ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎంపిడిఒ బికెఎస్‌ఎస్. వెంకట రామన్ అన్నారు.

# నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా..

## - బోడసకుర్రు సచివాలయం -2 భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అయితాబత్తుల



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్:** అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామ పంచాయతీ భవనం సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన నూతనంగా నిర్మించిన





సచివాలయం -2 భవనాన్ని గురువారం అమలాపురం శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రారంభోత్సవం చేసారు. ఆనంద రావు మాట్లాడుతూ అమలాపురం నియోజకవర్గం లోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని అన్నారు.ఎన్ డి ఏ ప్రభుత్వం వచ్చి 6 నెలలు మాత్రమే అయ్యిందని ఎవ్వరు కంగారు పడొద్దని ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చే ముఖ్య మంత్రి మనకు ఇప్పుడు ఉన్నారని అన్నారు. అల్లవరం మండలం లో అల్లవరం, గోడిలంక, బెండమూరులంక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని దేవగుప్తం ఫరిధిలో డి రావులపాలెం, గుండెపూడి సామంతకుర్రు, ఎస్ పల్లిపాలెం, యెట్రకొన గ్రామాలకు హాస్పిటల్ లేదని ఇంతక ముందు దగ్గర లో మూడు హాస్పిటల్ లు ఏర్పాటు చేసారని ఇప్పుడు దేవగుప్తం లో ఒక హాస్పిటల్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటానని దానికి మండల నాయకులు మద్దతు కావాలని అన్నారు. అలాగే అన్ని కులాలు కూడా కలిసికట్టుగా ఉండాలని అమలాపురం నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉండేలాగా చూస్తానని అన్నారు. ఈ సందర్భంగా భర్త చనిపోయిన భర్త పెన్షన్ బార్యకు కొత్తగా అందించడం జరిగింది. బోడసకుర్రు గ్రామంలో నిరూపయోగంగా ఉన్నా హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, డ్రైనేజి సమస్య, స్మశాన వాటికకు నిధులు కేటాయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఆనందరావు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం అప్పులు చేసి రాష్ట్రాన్ని పాడు చేసారని, గత ప్రభుత్వం 10 వేల కోట్లు అప్పులు చేసి 5 వేల కోట్లు పథకాలు పేరుతో పంపిణి చేసారు.

కానీ మిగిలిన 5 వేల కోట్లు ఏమి చేసారో లెక్కలు లేవని ఆనందరావు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలులో మొదటిదిగా 4000కు పెంచిన పెన్షన్ అందించడం జరిగిందని అన్నారు.రెండవదిగా గ్యాస్ రాయితీ పై ఇస్తున్నామని అన్నారు. మూడవదిగా సంక్రాతి పండగకు ఉచిత బస్ సౌకర్యం అమలు చేయడం జరుగుతుందని అన్నారు. మిగిలిన పథకాలు కూడా త్వరలో అమలు చేయడం జరుగుతుందని అధికారం వచ్చి కొన్ని నెలలు మాత్రమే అయ్యిందని అన్నారు. ఈ కార్యక్రమం లో అల్లవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు, అల్లాడి స్వామి నాయుడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి మెట్ల రమణబాబు, బి జె పి జిల్లా అధ్యక్షులు యాల్ల దొరబాబు, ఎంపీపీ ఇళ్ల శేషగిరి రావు, ఎంపీటీసీ దొమ్మేటి శాంతి భవాని,టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు చింతా శ్రీను, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ల శ్రీను, ఎంపీడీఓ కృష్ణ మోహన్ , గుణిశెట్టి రోహిని కుమార్, నీటి సంఘం అధ్యక్షులు దాట్ల గోపి రాజు,బొర్రా ఈశ్వరరావు, ముత్యాల బాబీ, డి ఈ రాజమోహన్, పాలకవర్గం సభ్యులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## నూతనోత్సాహంతో ప్రభుత్వ పథకాలను అమలుచేద్దాం

**జిల్లా కలెక్టర్ ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** నూతన సంవత్సర వేళ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను నూతనోత్సాహంతో సమర్థవంతంగా అమలుచేద్దామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో తనను కలిసి శుభాకాంక్షలు తెలిపిన అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతోందని, వాటిని విజయవంతంగా ప్రజలకు చేరవేయడంలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. నూతన సంవత్సర దినోత్సవ స్ఫూర్తితో సమష్టిగా పనిచేయడం ద్వారా జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా అడుగులు వేద్దామన్నారు.



## 'నన్నయ' అభివృద్ధికి సహకరించాలి

**దివాన్‌చెరువు, విశ్వం వాయిస్ న్యూస్:** ప్రతీ ఒక్కరూ తమ పనిని త్రికరణశుద్ధిగా నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయం 2025 క్యాలెండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాలు, అనుబంధ కళాశాలల సిబ్బంది, విద్యార్థులంతా నూతన లక్ష్యాలను ఎంచుకుని సాకారం చేసేందుకు కృషి చేయాలన్నారు. కొత్త సంవత్సరంలో విద్య, ఉద్యోగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలను వీసీ సందర్శించి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## చెడు వ్యసనాలకు దూరంగా నేటి యువత ఉండాలి

**- సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల**



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు దూరంగాఉండాలని, క్రమశిక్షణతో చదువుకోవాలని సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్,డిగ్రీ విద్యార్థులకు మద్యం,మత్తు పదార్థాలపై నూతన చట్టాలు,సైబర్ నేరాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత నేటి కూటమి ప్రభుత్వానికి ఉందని అన్నారు. కొందరు తల్లిదండ్రులు పిల్లల మీద అతి ప్రేమను చూపించడం, అవసరం లేకపోయినా డబ్బులు ఇవ్వడం వలన,తల్లిదండ్రు పిల్లలను సరిగా పట్టించుకోకపోవడం వలన యువత చెడు వ్యసనాలను అలవాటు చేసుకుని వారి భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. అధికారులతో పాటు విద్యావంతులు ఇతరులకు మార్గదర్శకంగా ఉండాల్సిన ఆవశ్యకత నేడు ఏర్పడిందని అన్నారు. యువతీ యువకులు చదువు పూర్తయిన అనంతరం జాబ్ ట్రయల్స్ చేస్తూ ఉద్యోగం సాధించి సమాజానికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు,వ్యాయామశాలలు ఏర్పాటుకు గ్రామ గ్రామాన నేటి కూటమి ప్రభుత్వం సహకరించాలని అన్నారు. గ్రామల రక్షణ,దొంగతనాల నివారణకు వీధిలైట్లు మాదిరిగా సీసీ కెమెరాలను కూటమి ప్రభుత్వంమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. యువత మద్యానికి అలవాటు పడటం వల్ల భవిష్యత్తు బానిసత్వం అవుతుందని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు చిత్తవుతాయనే విషయాన్ని నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నేటి యువత మద్యం మత్తులో ఎన్నో కేసుల్లో ఇరుక్కుని కోర్టుల చుట్టూ,సెంటర్ జైల్ చుట్టూ తిరిగే సందర్భాలు ఎదురవుతున్నాయని అన్నారు. అటు తల్లిదండ్రులకు ఉపయోగపడక మంచి జీవితంలోనూ స్థిరపడక ఎన్నో ఇబ్బందులు పడుతూ యువత రోడ్డున పడే పరిస్థితులు ఎదురవుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. 2025 సంవత్సరంలో నైనా యువత మంచి మార్పును కోరుకుని తల్లిదండ్రులకు,సమాజానికి,విద్యను నేర్పించిన గురువులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నానని పలివెల అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు,రాజానగర నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరికి,సిపిఐ ఎంఎల్ పార్టీ సంఘాలకు,రాష్ట్ర ప్రజలకు, అధికారులకు, నాయకులకు, మిత్రులకు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీడియా మిత్రులకు, శ్రేయోభిలాషులకు, అభిమానులకు, రైతులకు రైతు కూలీలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని పలివెల వీరబాబు అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతోనూ, అష్టైశ్వర్యాలతోనూ జీవించే లాగున ఆ భగవంతుడు ఆశీర్వదించాలని కోరుకుంటున్నానని వీరబాబు అన్నారు.

## పడిపోయిన 'మట్టం'..
# ఎత్తిపోతలకు కష్టం

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్:** పుష్కర ఎత్తిపోతల వద్ద పడిపోయిన నీటి మట్టాలు, ఇసుక మేటలు ఎగువ ప్రాంతంలో గోదావరి నదికి ఇన్‌ఫ్లో తగ్గిపోవడం వల్ల దిగువకు ప్రవహించే నీరు వేగం తగ్గడంతో ఎత్తిపోతల వద్ద నీటిమట్టాలు పడిపోయాయి. సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం వద్ద పుష్కర-1, 2 ప్రాజెక్టుల వద్ద 13 మీటర్లకు పైబడి ప్రవహించేలా నీటిమట్టం ఉంటేనే 8 పంపుల ద్వారా 1,400 క్యూసెక్కుల నీటిని తూర్పు, కాకినాడ జిల్లాల్లోని 18 మండలాలకు సరఫరా చేసేందుకు వీలుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో గోదావరి నీటిమట్టం ఎన్నడూ లేని విధంగా పెరగడమే కాకుండా సుమారుగా నాలుగు నెలల పాటు తగ్గకుండా నీటి మట్టాలు ఉండటంతో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సక్రమంగా నీరు చేర్చగలిగారు. జలవనరుల శాఖ లెక్కల ప్రకారం గత నెల 16 నాటికి ఖరీఫ్ సీజన్ పూర్తయింది. సుమారుగా 3.06 టీఎంసీల నీటిని చేర్చగలిగారు. దీనివల్ల మెట్ట ప్రాం



తంలో ఆయకట్టు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం రబీ సీజన్‌లో మెట్ట ప్రాంతంలో వేసే అపరాల పంటకు కొంత సాగునీరు అవసరం. ఇప్పటికే మెట్ట ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు రైతాంగానికి నీటి అవసరంపై జలవనరుల శాఖ ఉన్నతా ధికారులను కలిసి వినతులు ఇవ్వడంతో ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. పుష్కర ప్రాజెక్టుల వద్ద 13.5 మీటర్లకు నీటిమట్టం ఉన్నప్పటికీ వేగవంతమైన ప్రవాహం లేకపోవడంతో అన్ని పంపులు తిరిగే పరిస్థితులు లేవు. ఎత్తిపోతల వెల్ వద్ద వేసిన ఇసుక మేటల వల్ల మోటార్లు తిరిగితే పంపుల్లోకి ఇసుక చేరే ప్రమాదం పొంచి ఉండటాన్ని సాంకేతిక బృందం గుర్తించింది.

**పగలే నీటిమట్టం చూసుకుంటూ..**

ఇన్‌ఫ్లో పడిపోయి నీటిమట్టాలు తగ్గిన ఎత్తిపోతల వద్ద.. మోటార్లు దెబ్బతినకుండా ఉండేలా జలవనరులశాఖ సాంకేతిక బృందం ఇచ్చిన సూచనతో కొంత నీటిని మెట్టకు చేర్చేలా బుధవారం నుంచి అధికారులు చేపట్టారు. ఒక పంపు ద్వారా 175 క్యూసెక్కుల నీటిని రైతుల అవసరాలు తీర్చేలా సరఫరా చేస్తున్నారు. అదీ నీటిమట్టం చూసుకుంటూ పగలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు తిరిగేలా చర్యలు తీసుకున్నారు. రాత్రి సమయంలో మోటారు ఆన్ చేస్తే నీటిమట్టం లేక ఇసుక పంపుల్లోకి లాగేస్తే రూ.లక్షల విలువైన మోటార్లు, పంపులు పాడైపోయే ప్రమాదం ఉంది. సుమారుగా 11 గంటల పాటు చేసే నీటి సరఫరా అపరాల పంటలకు సరిపోతాయని మెట్ట రైతులు చెబుతున్నారు. గోదావరి నదిలో ఇన్‌ఫ్లో పడిపోయి ఇసుక మేటలు బయటపడుతున్నాయని.. పథకాలు దెబ్బతినకుండా చూసుకుంటూ ముందుకు వెళుతున్నామని జలవనరులశాఖ డీఈ సీహెచ్.కోటేశ్వరరావు తెలిపారు.

## జైపాల్ సింగ్ ముండా 122వ జయంతి వేడుకలకు
# ఆదివాసీలు తరలిరండి

**ఆదివాసి జేఏసీ పిలుపు**

**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్:** ఇందుకూరులో జరిగే జైపాల్ సింగ్ ముండా 122వ జయంతి వేడుకలకు ఆదివాసీలంత తరలి రావాలని ఆదివాసి జేఏసీ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్,డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం,మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్ తెల్లంశేఖర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా,దేవీపట్నం మండలం, ఇందుకూరు రెవిన్యూ గ్రామంలోని యలగాడ నాగేశ్వరరావు ఇంటి దగ్గర ఉదయం 10 గంటలకు జైపాల్ సింగ్ ముండా 122వ జయంతి వేడుకలు కార్యక్రమానికి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, ఆదివాసీలందరూ మరియు నూతనంగా ఎన్నికైన పీసా గ్రామసభ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో నూతనంగా ఎన్నికైన పీసా గ్రామసభ ఉపాధ్యక్షులు, కార్యదర్శిలకు జైపాల్ సింగ్ ముండా చిత్రపటాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి



ముఖ్యఅతిథిగా ఆదివాసి మహాసభ న్యాయ సలహాదారు న్యాయవాది అయినారపు సూర్య నారాయణ హాజరవుతున్నారన్నారు.
ఈ కార్యక్ర మంలో ఆదివాసి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి, డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం, మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్ కారం రామన్న దొర, ఆదివాసి జేఏసీ దేవీపట్నం మండల కార్యదర్శి,డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాజమహేంద్రవరం, మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్ యలగాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నరన్నారు.


# గంజాయి స్మగ్లర్ల దారుణం



**కిర్లంపూడి, విశ్వం వాయిస్ న్యూస్:** కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ గేట్ వద్ద గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోయారు. నూతన సంవత్సరం వేళ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులకు స్మగ్లర్లు షాక్ ఇచ్చారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా డిసెంబర్ 31న అర్ధరాత్రి సమయంలో కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. అయితే అదే సమయంలో గంజాయి స్మగ్లర్ల కారును పోలీసులు ఆపేశారు. కారును పక్కకు తీసుకు రావాల్సింది పోలీసులు వారికి చెప్పారు. అయితే కారును పక్కకు ఆపుతున్నట్లు నటించిన స్మగ్లర్ ఒక్కసారిగా వేగంగా ముందుకు నడిపాడు. దీంతో కారు ఇద్దరి కానిస్టేబుళ్ల పైనుంచి దూసుకెళ్లింది. వాహనం ముందు నిలుచున్న కానిస్టేబుల్ లోవరాజు తోపాటు మరో కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడిన కానిస్టేబుళ్లను తోటి పోలీసులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే టోల్ ప్లాజా వద్ద నుంచి పారిపోయిన నిందితులు తమ కారును రాజానగరం సమీపంలోని కెనాల్ రోడ్డులో వదిలి పరారయ్యారు. దుండగులంతా ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. టోల్ ప్లాజా సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ఆధారంగా వారిని పట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే గంజాయి స్మగ్లర్లు కారును పోలీసులపైకి ఎక్కించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## ముద్దాయిని అరెస్టు చేసి
# సెంట్రల్ జైలుకు తరలింపు

**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కాటవరం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ అనే వ్యక్తిపై సీతానగరం పోలీస్ స్టేషన్ నందు నమోదు కాబడిన Cr.no. 1/2025 U/s 74,118(1) , 109, 189(2), 189(4) r/w 190 BNS ACT (307,354,324,143,144 r/w 149 IPC) కేసులో 02.01.2025 వ తేదీన అరెస్టు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించడం జరిగింది. ముద్దాయి అరెస్టు సందర్భంగా కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్ ముద్దాయికి కౌన్సిలింగ్ చేయడం కూడా జరిగింది. మరియు ఇటువంటి సంఘ విద్రోహ చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అరెస్టు కాబడిన పైన తెలిపిన ముద్దాయి పై రౌడీ షీట్ కూడా త్వరలోనే ఓపెన్ చేస్తామని తెలియజేసారు. కావున మండలంలో ముఖ్యంగా యువత ఎటువంటి గొడవలు పడకుండా చట్ట పరిధిలో వ్యవహరిస్తూ పోలీసు వారికి సహకరించవలసిందిగా కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్ యువతను హెచ్చరించారు.




## ద్విచక్ర వాహనదారులకు
# హెల్మెట్ తప్పనిసరి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకాన్ని అలవాటు గా చేసుకోవాలని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్లు ధరించే అలవాటును తన సిబ్బంది నుంచే ముందుగా చేపట్టాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. వాహనదారులు హెల్మె ట్ ధరించక రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బైక్‌పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో రావులపాలెం సీఐ శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ అధికారిగా మారిన
# ఎమ్మెల్యే "ఆదిరెడ్డి"

**46వ డివిజన్‌లో సారా సేవించే వారిని పట్టుకున్న వైనం**
**సారా విక్రేత... సేవించే వారిని స్టేషన్‌కు తరలింపు**
**మీ ఉద్యోగం కూడా నేనే చేస్తున్నానంటూ పోలీసు.. ఎక్సైజ్ అధికారులకు చురకలు**
**ఇలా అయితే ఇబ్బందులు తప్పవంటూ హెచ్చరిక**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి నగరాభివృద్ధిపై దృష్టి పెట్టిన రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్... రెండో రోజు నుంచి నగరంలోని గంజాయి, సారా, బ్లేడ్ బ్యాచ్ నివారణకు శ్రీకారం చుట్టారు. దానిలో భాగంగానే "మీ భద్రత-మా బాధ్యత" అంటూ ఇప్పటి వరకూ నగరంలోని వివిధ ప్రాంతాలు, విద్యా సంస్థల్లో సుమారు 18 వరకూ సమావేశాలు పెట్టి గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు, సారా నిర్మూలన పట్ల మహిళల్లో అవగాహన పెంచారు. కాగా స్థానిక 46వ డివిజనకు ఒక అధికారిక కార్యక్రమం నిమిత్తం వెళ్లగా రామదాసుపేటలోని సెల్ టవర్ వద్ద కొంతదరు సారా సేవిస్తున్నారన్న విషయం తెలు సుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక నాయకులతో ఆ ప్రాంతానికి వెళ్ళారు. ఆయన్ను... ఆయనతో పాటు ప్రొటోకాల్ నిమిత్తం వచ్చిన ఇద్దరు పోలీసుల్ని చూసిన సారా సేవిస్తున్న సుమారు ఐదు గురు అక్కడి నుంచి పలాయనం చిత్తగిం చేందుకు ప్రయత్నించగా పోలీసులు, స్థానిక నాయ కులు వారిని పట్టుకున్నారు. స్థానికంగా సారా విక్రయిస్తున్న మహిళను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మంద లించారు. ఒక పక్క నుంచి తాము నగరంలో సారా, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల నిర్మూలను నిరం తరం పాటుపడుతుంటే మీరేమో యధేచ్ఛగా సారా విక్రయిస్తున్నా రంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచే ఎక్సైజ్ సీఐ,ఇతర ఎక్సైజ్, పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు విషయమై గతంలోనే తాము ఎస్పీ వారికి ఫిర్యాదు చేసినా చర్యలు ల్లేవని, అందుకే తాము ప్రత్యక్షంగా రంగంలోకి దిగామ న్నారు. మీ ఉద్యోగం కూడా మేము చేయాల్సి వస్తోం దని, సారా విక్రేతలు, సారా సేవించే వారిని తామే పట్టుకుని అప్పగించాల్సిన దుస్థితి వచ్చిందంటూ చురకలు అంటించారు. ఇలా అయితే ఇబ్బందులు తప్పవంటూ హెచ్చరించారు. కాగా ఆ ప్రాంతంలో వేలాదిగా విచ్చల విడిగా సేవించిన ఉన్న సారా ప్యాకెట్ల కవర్లను చూసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ స్థాయిలో ఈ ప్రాం తంలో సారా వ్యాపారం జరుగుతోందని, సంబ ంధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. కాగా సారా సేవిస్తున్న, విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

# కొత్త ఏడాది కొలువుల కళ

## వైద్యకళాశాల, జీజీహెచ్‌లో ఖాళీల భర్తీకి ప్రకటన?

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాల పరిధిలో సాంకేతిక, పారామెడికల్ వైద్య సిబ్బంది నియామకాలకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా కలెక్టర్ అనుమతితో ఈ నెలలో ప్రకటన విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. కొత్త ఏడాది వేళ కొలువుల కోసం వేచి ఉన్న అభ్యర్థులకు ఇదో మంచి అవకాశం. గత ప్రభుత్వం 2023 నవంబరులో జీజీహెచ్, వైద్య కళాశాలలో 77 పోస్టులకు ప్రకటన విడుదల చేసి డిసెంబరులో ఉద్యోగాలు ఇచ్చేస్తామని చెప్పింది. ఆ పోస్టుల్లో రాజకీయ జోక్యం కారణంగా అర్హులకు అన్యాయం జరుగుతుండడంతో అప్పట్లో నిలిపివేశారు. దాదాపు ఏడు వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆ ప్రకటన విడుదలై ఏడాది గడిచినా ప్రక్రియ పూర్తవకపోవడంతో దానిని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు రద్దు చేశారు. ప్రస్తుతం ఆ 77 పోస్టులకు తోడు జీజీహెచ్‌లో మరో 38 ఖాళీలను కలిపి మొత్తంగా ఉద్యోగ ప్రకటన విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



## సింహ వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

**బిక్కవోలు, విశ్వం వాయిస్ న్యూస్:** తూర్పు తిరుమల గా పేరొందిన బలభద్రపురం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ద్వితీయ బ్రహ్మోత్సవాలు బుధవారం తొమ్మిదవ రోజుకు చేరాయి. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించి సహస్ర కలశాభిషేకం, సుగంధ పుష్పాభిషేకం, మార్గ శీర్ష వ్రతం కార్యక్రమాలు జరిపారు. రాత్రి గోవింద నామ స్మరణల మధ్య సింహ వాహనంపై శ్రీమలయ్యప్పస్వామి అవతారంలో స్వామి అమ్మవార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి అన్న ప్రసాదాన్ని ఏర్పాటుచేశారు. ఈ బ్రహ్మో త్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





# బ్లింకిట్ కొత్త సర్వీస్..

## ఇప్పుడు పది నిమిషాల్లోనే మీ ముందు అంబులెన్స్..



క్విక్ కామర్స్ ఫ్లాట్ ఫార్మ్ బ్లింకిట్ ఇప్పుడు ఒక కొత్త సర్వీస్ ప్రారంభించింది. ఈ సర్వీస్ 10 నిమిషాల్లో అంబులెన్స్ సర్వీస్ దీనిని ప్రస్తుతం గురుగ్రామ్ నగరంలో ప్రవేశపెట్టింది. బ్లింకిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అల్బిందర్ ధింద్సా నేడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ %శ%లో దీనికి సంబంధించి పోస్ట్ చేసారు. మా సర్వీసెస్ లభించే నగరాల్లో క్విక్ అండ్ నమ్మకమైన అంబులెన్స్ సర్వీస్ అందించే సమస్యను పరిష్కరించడానికి మేము ఒక అడుగు ముందుకు వేస్తున్నాము" అని Xపోస్టులో చెప్పారు. ప్రస్తుతం గురుగ్రామ్ నగరంలో కంపెనీ ఈరోజు ఐదు అంబులెన్స్‌లను ప్రారంభించింది, త్వరలో కంపెనీ మరిన్ని ప్రాంతాలకు ఈ సర్వీస్ విస్తరించే ఆలోచనలో ఉందని అల్బిందర్ ధింద్సా తెలిపారు. "మొదటి ఐదు అంబులెన్స్‌లు ఈరోజు నుండి గురుగ్రామ్‌లో రోడ్స్ పైకి వస్తాయి. మేము ఈ సర్వీస్ మరిన్ని ప్రాంతాలకు విస్తరించకా ఏ బ్లింకిట్ యాప్ ద్వారా బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ని బుక్ చేసుకునే అప్షన్ చూస్తారు" అని Xపోస్ట్‌లో అంబులెన్స్ ఇన్ 10 మినట్స్ పేరుతో పోస్ట్ చేసారు. "కంగ్రాచ్యులేషన్స్ అల్బీ! చాలా ఉపయోగకరమైన ఆలోచన. ఇది పూర్తిగా వాణిజ్యపరంగా విజయ వంతమవుతుందని అలాగే మరిన్ని నగరాల్లో అంబులెన్స్ సమస్యను పరిష్కరిస్తుందని ఆశిస్తు న్నాము , "అంటూ Paytm వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ Xలోరిప్లయ్ చేసారు.


బ్లింకిట్ అంబులెన్స్ ఫీచర్లు Xలోని పోస్ట్ ప్రకారం, కొత్తగా ప్రారంభించిన బ్లింకిట్ అంబులెన్స్‌లలో ఆక్సిజన్ సిలిండర్లు, మానిటర్లు అలాగే స్ట్రెచర్‌లు వంటి వైద్య పరికరాలతో పాటు ఇతర అవసరమైన మెడికల్ టూల్స్ ఉంటాయి. "మా అంబులెన్స్‌లలో ఆక్సిజన్ సిలిండర్లు, AED (ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్), స్ట్రెచర్, మానిటర్, అవసరమైన అత్యవసర మందులు, ఇంజెక్షన్‌లతో సహా ప్రాణాలను రక్షించే పరికరాలు ఉన్నాయి " అని బ్లింకిట్ CEO Xలో వెల్లడించారు. ప్రతి అంబులెన్స్‌లో ఒక పారామెడిక్, అసిస్టెంట్ అండ్ ట్రైనింగ్ పొందిన డ్రైవర్ కూడా ఉంటారు. 10-నిమిషాల అంబులెన్స్ సర్వీస్ వెనుక ఉన్న ఆలోచనను అల్బిందర్ ధింద్సా చెప్తూ చాల కాలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించడానికి కంపెనీ ఈ సర్వీస్ అందుబాటు ఖర్చుతో నిర్వహించాల నుకుంటున్నట్లు చెప్పారు. "లాభం ఇక్కడ లక్ష్యం కాదు. మేము ఈ సర్వీస్ కస్టమర్లకు అందుబాటులో ఉండే ధరతో నిర్వహిస్తాము "అని కూడా పోస్ట్ చేసారు. బ్లింకిట్ రాబోయే రెండేళ్లలో అన్ని ప్రముఖ నగరాలకు అంబులెన్స్ సేవలను తీసుకురావాలని చూస్తుంది. బ్లింకిట్ ఈ అంబులెన్స్ సర్వీస్ ప్రారంభంను సోషల్ మీడియాలో ఎంతో మంది ప్రజలు ప్రశంసించారు. ఎక్కువ డిమాండ్ ఉన్న సమయాల్లో సర్వీస్ అధిక ధర ఉండటం గురించి కూడా ఆందోళనలను వ్యక్తం చేసిన వారు ఉన్నారు.

# రైతులకు ఏపి సర్కార్ గుడ్ న్యూస్..

## సంక్రాంతి తరువాత 20వేలు ఖాతాలోకి..

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రైతులకు సంబంధించి అన్నదాత సుఖీభవ పథకంపై కీలక ప్రకటన చేసింది. రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదికి ఇచ్చే రూ.6వేలతో కలిపి అన్నదాత సుఖీభవ పథం కింద ఇప్పుడు మొత్తం రూ.20వేలు అందజేయనున్నారు. అయితే గత ప్రభుత్వంలో రూ.13500 అందజేశారు. త్వరలోనే ఈ పథకాన్ని అమలు చేస్తూ రైతుల అకౌంట్లో జమ చేయనున్నారు.

అయితే దీనికి సంబంధించి సంక్రాంతి తరువాత అన్నదాత సుఖీభవకి శ్రీకారం చుట్టనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6 నెలలు కావోస్తుండగా ఇచ్చిన హామీల అమలు దిశగా ముందుకు వెళ్తుంది. గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా పేరుతో ఉన్న





పథకాన్ని అన్నదాత సుఖీభవగా మార్పు చేసింది ఏపి కూటమి ప్రభుత్వం. ఈ పథకం ముఖ్య ఉదేశ్యం ఏపి రాష్ట్రంలోని రైతులకు ఆర్థిక సహాయం అందించడం ఇంకా రైతుల పెట్టుబడి ఖర్చులను తగ్గించడం, పంటల అమ్మకాలు సులభతరం చేయడం. దీని ద్వారా రైతులకు పెట్టుబడికి కావలసిన మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా అర్హులైన రైతు బ్యాంక్ అకౌంట్లో వెస్తుంది. అన్నదాత సుఖీభవ స్కిం అర్హతలు: ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రైతులు మాత్రమే అర్హులు. లిఈ పథకం కోసం రైతులు వాళ్ళ పేరు మీద ఉన్న వ్యవసాయ భూమి వివరాలను ప్రభుత్వం దగ్గర రిజిస్టర్ చేయాలి. లిప్రస్తుతం వ్యవసాయ పంటలు పండిస్తున్న రైతులే ఈ పథకానికి అర్హులు. వ్యవసాయం పండించని భూములపై ఈ పథకం వర్తించదు. లికేవలం చిన్న రైతులు, మధ్యస్థ రైతులే ఈ పథకం లబ్ది పొందుతారు.

అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతుల ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ తో లింక్ చేసి ఉండాలి.

# సీనియర్ సిటిజన్లకు కేంద్రం గుడ్ న్యూస్..

## ఇక పై కాళ్ళు అరిగేలా తిరగక్కర్లేదు..




ఈ న్యూ ఇయర్ 2025 సందర్భంగా వృద్ధులకు అలాగే పెన్షనర్లకు గొప్ప రిలీఫ్ అందించే వార్త ఒకటి వచ్చింది. ప్రభుత్వం ఇంకా ఆర్థిక సంస్థలు పెన్షన్ విత్ డ్రా అలాగే డిజిటల్ పేమెంట్ ప్రాసెస్ ఈజీ చేయడానికి, మరింతగా అందుబాటులోకి తీసుకురావడానికి కొన్ని కీలక చర్యలు తీసుకున్నాయి. ఇప్పుడు పింఛనుదారులు పెన్షన్ డబ్బును దేశంలోని ఏ బ్యాంక్ బ్రాంచ్ నుండి అయినా విత్‌డ్రా చేసుకోవచ్చు. దీనితో పాటు డిజిటల్ ట్రాన్సక్షన్స్ ఈజీ చేసే %ఖూ×% (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్)లో కూడా మార్పులు చేసింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన్ నేషన్ వన్ పెన్షన్ కింద ఈ సదుపాయం పెన్షనర్లకు అందించనుంది. ఈజీగా పింఛను విత్ డ్రా పింఛనుదారులకు పెద్ద రిలీఫ్ ఏమిటంటే, ఇప్పుడు పెన్షన్‌ను విత్‌డ్రా చేసుకోవడానికి మీకు అకౌంట్ ఉన్న బ్యాంకు బ్రాంచ్‌కు వెళ్లవలసిన అవసరం లేదు. కొత్త విధానం ప్రకారం ఏదైనా బ్యాంకు శాఖ నుండి పెన్షన్ విత్ డ్రా సౌకర్యం కల్పించనుంది.

# చేనేత వస్త్రాలకు మంచి ఆదరణ





**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్**

చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్న బొమ్మన సంస్థ బుట్ట బొమ్మ పేరిట శారీ స్టోర్ ను మద్దిలపాలెం లో ప్రారంభించడం సంతోషదాయకమని వీఎంఆర్ డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదురుగా ఇటీవల ప్రారంభించిన బుట్టబొమ్మ షోరూం ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మహిళలు మెచ్చే విభిన్న డిజైన్ల తో కూడిన వస్త్రాలు బుట్ట బొమ్మ శారీ స్టోర్ లో అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నా యన్నారు. మహిళలు బుట్ట బొమ్మ షోరూం లో కొనుగోలు చేసి ఆదరించాలన్నారు. చేనేత రంగంపై ఆధారపడిన వారిని ప్రోత్సహించాలనే ఆశయం తో బొమ్మన కుటుంబం సుదీర్ఘ కాలంగా వస్త్ర వ్యాపారం చేస్తూ విశేషంగా ప్రజాదరణ పొందిందన్నారు. మద్దిలపాలెం వద్ద సొంత భవన సముదాయం లో బుట్ట బొమ్మ శారీ స్టోర్ ను ప్రారంభించడం వలన తక్కువ ధరకు వస్త్రాలు విక్రయించడానికి వీలుకలుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో బొమ్మన అధినేత బొమ్మన సత్యరాజ్ కుమార్, బొమ్మన సునీత, బొమ్మన మణిరాజ్, బొమ్మన యువరాజ్ పాల్గొన్నారు.

# ఉద్యోగం కోసం పరిగెత్తి ప్రాణం పోగొట్టుకున్నాడు-బందరులో విషాదం..!



**బందరు, విశ్వంవాయిస్ న్యూస్**

ఏపీ కానిస్టేబుల్ పరీక్షల్లో ఇవాళ ఓ విషాదం చోటు చేసుకుంది. కృష్ణాజిల్లాలో కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఫిట్ నెస్ పరీక్షల్లో పాల్గొనేందుకు వచ్చిన ఓ అభ్యర్థి పరుగు తీస్తూ ప్రాణం కోల్పోయాడు. దీంతో బందరులో విషాద ఛాయలు నెలకొన్నాయి. కానిస్టేబుల్ అభ్యర్థులకు ఇప్పటికే రాత పరీక్షలు పూర్తి కావడంతో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో ముఖ్యమైన పరుగు పందెం ఈ విషాదానికి కారణమైంది. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్ లో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పరుగు పందెం నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనేందుకు వచ్చిన ధారావత్ చంద్రశేఖర్ అనే అభ్యర్థి 1600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నాడు. ఇతర అభ్యర్థులతో కలిసి కాసేపు పరుగు తీసిన హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. దీంతో అతన్ని వెంటనే గుర్తించిన పోలీసులు.. సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతను చనిపోయాడు. కానిస్టేబుల్ పరుగు పందెంలో మృతి చెందిన అభ్యర్థి కృష్ణాజిల్లా ఏ కొండూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గా గుర్తించారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా బందరులో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు ఇలా పోలీస్ పరేడ్ గ్రౌండ్లో దేహ దారుఢ్య పరీక్షలు జరుగుతున్నాయి. అయితే శుభవార్తతో ఇంటికి వస్తాడని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు చంద్రశేఖర్ తీరని శోకం మిగిల్చాడు.

# రూ.4లక్షల చోరీ సొత్తు రికవరీ

**పెందుర్తి, విశ్వంవాయిస్ న్యూస్**

స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసును పెందుర్తి క్రైం పోలీసులు చేధించారు. రూ.నాలుగు లక్షల విలువైన ఆభరణాలను, చోరీ సొత్తును రికవరీ చేశారు. ఇద్దరు పాత నేరస్తులతోసహాముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించి వెస్ట్ క్రైం ఎసిపి డి.లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. జివిఎంసి 94వ వార్డు పరిధిలోని పురుషోత్తపురానికి చెందిన నాగరత్నం అనే మహిళ గతనెల 7న హైదరాబాదు వెళ్లారు. ఈ నేపథ్యంలో తాళాలు వేసిన ఇంటిని గమనించిన దొంగలు ఇంట్లో చొరబడి బంగారు, వెండి ఆభరణాలను దొంగతనం చేశారు. తిరిగొచ్చిన తర్వాత ఇంట్లో అంతా చిందరవందరగా ఉండడం, దొంగతనం జరిగి, బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించిన బాధితురాలు పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. అందిన ఫిర్యాదు మేరకు ఈనెల 19న కేసు నమోదు చేసిన పెందుర్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 30న సోమవారం గోశాల జంక్షన్ వద్ద చోరీకి పాల్పడిన నిందితుడు ఉమ్మడి



సతీష్‌ను పెందుర్తి క్రైం పోలీసులు చాకచక్యంగా పట్టుకోగా, అతనిని విచారించిన మీదట చోరీలో పాల్గొన్న మరో ఇద్దరు పాత నేరస్తులు ఎర్రపల్లి మూర్తి, షేక్ నజీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తమదైన రీతిలో విచారించిన పోలీసులు, వారి నుంచి రూ. 4 లక్షల విలువచేసే 118 గ్రాముల బంగారం, రెండు కేజీలు వెండి ఆభరణాలతోపాటు, 15 కిలోల ఇత్తడి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును చాకచక్యంగా చేధించినపెందుర్తి క్రైం సిఐ ఎం.శ్రీనివాస్, ఎస్ఐ సూరిబాబు, ఇతర సిబ్బందిని ఎసిపి లక్ష్మణమూర్తి అభినందించారు.

# సీరియల్ నటికి వేధింపులు... నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్** టీవీ సీరియల్ నటిని వేధిస్తున్న ఓ యువకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 29 ఏళ్ల మహిళ యూసుఫ్‌గూడ ప్రాంతంలో తన పిల్లలతో కలిసి ఉంటోంది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఓ సీరియల్‌లో చేస్తున్న



సమయంలో ఫణితేజ అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా మారింది. పెళ్లి చేసుకుంటానని రెండు నెలల క్రితం అతను చెప్పాడు. ఆమె మాత్రం తనకు పెళ్లయిందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పి పెళ్లికి నిరాకరించింది. ఆరోజు నుంచి నిందితుడు ఆమెను ప్రేమ, పెళ్లి పేరుతో వేధించసాగాడు. అసభ్యకర సందేశాలు, వీడియోలు వాట్సాప్ ద్వారా పంపిస్తూ వేధించాడు. బాధితురాలి అత్త ఇంటి చిరునామా తెలుసుకొని అక్కడకు వెళ్లి ఆమె గురించి చెడుగా చెప్పాడు. అతని వేధింపులు భరించలేక బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలియడంతో అతను ఆమెకు ఓ సెల్ఫీ వీడియోను పంపించాడు. తన వల్లే ఇదంతా జరిగిందని అందులో పేర్కొన్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# గురక సమస్యను ఈ చిట్కాలతో దూరం చేసుకోండి..



గురక సమస్య వల్ల సరిగా నిద్ర పోలేరు. అంతేకాకుండా ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. వయసు పెరిగే కొద్దీ గురక సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. గట్టిగా గురక పెట్టేవారు స్లీప్ అప్నియా టెస్ట్ ను చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. స్లీప్ అప్నియా అంటే నిద్రపోతున్న సమయంలో సడెన్ గా శ్వాస తీసుకోవడం ఆగిపోతుంది. దీనివల్ల శరీరానికి ఆక్సిజన్ సరిగ్గా అందదు. దీంతో గురక పెడతారు. చాలా మంది ఇది హానికరం కాదని అనుకుంటారు. అయితే, దీనివల్ల ఒక్కొక్కసారి మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ముందుగానే గురక సమస్యను ఈ చిట్కాలతో దూరం చేసుకోండి.

ప్రాణాయామం..

ప్రాణాయామం చేయడం వల్ల ఊపిరితిత్తులకు సరిపడా ఆక్సిజన్ అందుతుంది. కాబట్టి గురక సమస్య ఉన్న వారు ప్రాణాయామం చేయడం మంచిది.

బరువు తగ్గించుకోవాలి..

అధిక బరువు ఉండటం కూడా గురక సమస్యకు కారణం అవుతుంది. శ్వాసక్రియకు ఇబ్బందులు తలెత్తుతాయి. కాబట్టి అధిక బరువు ఉన్న వారు బరువు తగ్గేందుకు ప్రయత్నించండి.

సిగరెట్ మానుకోవాలి..

పొగ తాగే అలవాటు ఉన్నవారికి గురక సమస్య వచ్చే అవకాశం ఉంది. కాబట్టి అనారోగ్యకరమైన సిగరెట్ అలవాటును మానుకుంటే మంచిదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తలగడ పెట్టుకోండి..

గురక సమస్య ఉన్న వారు నిద్రించే సమయంలో తలగడ ఉంచుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల గురక కొంత వరకు తగ్గుతుంది. అంతేకాకుండా, ఎడమవైపు లేదా కుడివైపు తిరిగి పడుకుంటే మంచిది. అలా పడుకోవడం వల్ల వాయు మార్గాలు తెరిచి ఉంటాయి కాబట్టి కొంతమేరకు గాలి ప్రవాహం సులువుగా జరుగుతుంది.

ఆల్కహాల్ మానుకోవాలి..

గురక సమస్య ఉన్న వారు నిద్రించే ముందు ఆల్కహాల్ తీసుకోవడం మంచిది కాదు. ఆల్కహాల్ గొంతులోని కండరాలను సంకోచించేలా చేసి గాలి సరిగా ఆడకుండా చేస్తుంది.

గ్లాసు పాలు..

రాత్రిపూట పడుకునే ముందు గ్లాసు పాలలో రెండు చెంచాల పసుపు కలుపుకొని తాగితే గురక సమస్య దూరం అవుతుంది.

యాలకుల గింజలు..

గ్లాసు వేడి నీటిలో అర టేబుల్ స్పూన్ యాలకుల గింజల పొడిని కలుపుకొని తాగినా కూడా మంచి ఫలితం ఉంటుంది.

నెయ్యి..

వడగట్టిన నెయ్యిని ముక్కు రంధ్రాల్లో రెండు చుక్కల చొప్పున వేసుకున్నా

# సీజనల్ వ్యాధులను ఈ మందులతో అడ్డుకట్ట వేయొచ్చు!

వానలతో నీటి నిల్వ వల్ల, దోమలు పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు విపరీతంగా వ్యాపిస్తున్నాయి. హెూమియో మందులతో వీటికి అడ్డుకట్ట వేయవచ్చు. వానాకాలంలో విజృంభించే బ్యాక్టీరియా, వైరస్‌ల వల్ల జలుబు, జ్వరం, మలేరియా, టైఫాయిడ్, బ్రాంఖైటిస్ మొదలైన వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే చికున్ గున్యా, డెంగ్యూలతో అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులను ప్రారంభంలోనే గుర్తించి, సత్వర వైద్యం తీసుకోవడం వల్ల పరిస్థితి విషమించకుండా ఉంటుంది. తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు, నీరసం, ఆకలి మందగించడం, వికారం, వాంతులు, శరీరం మీద దద్దుర్లు, చర్మం ఎర్రబడడం, అంతర్గత, బాహ్య రక్తస్రావం డెంగ్యూ ప్రధాన లక్షణాలు. పరిస్థితి తీవ్రమైతే రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గిపోతాయి. అవసరాన్ని బట్టి ఐవి ద్వారా ద్రవాలను అందిస్తూ, రక్తపోటును పరీక్షిస్తూ ఉండాలి. కొన్ని సందర్భాల్లో ప్లేట్‌లెట్ల మార్పిడి కూడా అవసరం పడవచ్చు.

హెూమియో పాత్ర ఇదే!

డెంగ్యూ అనేది ఆస్పత్రిలో రోగిని నిశితంగా పరిశీలించవలసిన వ్యాధి. సంప్రదాయ ఔషధాలతో పాటు హెూమియో మందులను కూడా ఇవ్వడం ద్వారా రోగి కోలుకునే సమయం వేగాన్ని పెంచవచ్చు. హెూమియో మందుల్లో భాగంగా యూపటోరియం పర్ఫ్‌ను 30 పొటెన్సీతో తీసుకోగలిగితే, ప్రోత్సాహక ఫలితాలు దక్కడంతో పాటు



రోగి బాధలు తగ్గి, కోలుకునే వేగం పెరుగుతుంది. రోగి లక్షణాల ఆధారంగా ఇదే ఔషధాన్ని వేర్వేరు పొటెన్సీలలో వైద్యుల సూచనలను బట్టి వాడుకోవచ్చు. అలాగే ఎకొనైట్, బెల్లడొనా, బ్రయోనియా, జెల్సిమియం, ఇపెకాక్, క్రోతాలస్, ఫాస్ఫరస్, రస్టాక్స్ వంటివి సమర్థవంతంగా పని చేస్తాయి. ముందస్తు జాగ్రత్తలు పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంట్లోని నీటి ట్యాంకులు శుభ్రం చేసుకోవాలి. కాచి వడబోసిన మంచి నీళ్లు తాగాలి. తాజా ఆహారం, సీజనల్ ఫ్రూట్స్ తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. సంపులు, నీటి ట్యాంకుల్లోకి దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు, శరీరానికి లేపనాలు వాడాలి. డెంగికి కారణమైన ఈజిప్టీ దోమలు పగటివేళ కుడతాయి. కాబట్టి బడుల్లో తగిన జాగ్రత్తలు పాటించేలా యాజమాన్యాలకు సూచించాలి.



# అవ్నీత్ కౌర్ సింపుల్ లుక్స్

అవ్నీత్ కౌర్ వినోద ప్రపంచంలో ప్రసిద్ధ వ్యక్తి. 2010లో జీ టీవీలో డ్యాన్స్ షోతో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. సెమీఫైనల్స్‌కు చేరుకోలేకపోయినప్పటికీ, ఆమె బలమైన ముద్ర వేసింది. ఇది ఆమె విజయవంతమైన కెరీర్‌కు నాంది పలికింది. అవ్నీత్ త్వరలో మరో డ్యాన్స్ పోటీలో పాల్గొన్నాడు. ఆమె ప్రతిభ మరియు అంకితభావం ఆమె దృష్టిని మరింత ఆకర్షించింది. క్రమంగా ఆమె నటనలోకి మారింది. ఆమె అనేక టెలివిజన్ షోలలో కనిపించింది. ఆమె నటన ప్రేక్షకులకు నచ్చింది. అవనీత్ సినిమాలు మరియు మ్యూజిక్ వీడియోలలో అవకాశాలను కూడా అన్వేషించాడు. ఆమె బహుముఖ కళాకారిణిగా మారింది. కొన్నేళ్లుగా ఆమె కీర్తి పెరుగుతూనే ఉంది. విభిన్న పాత్రలలో ఆమె గొప్ప నైపుణ్యం మరియు అనుకూలతను ప్రదర్శించింది. చెప్పుకోదగ్గ ప్రాజెక్ట్ లవ్ ఇన్ వియత్నాం. ఈ చిత్రాన్ని 2024 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రకటించారు. ఇది భారతదేశం మరియు వియత్నాం మధ్య ఒక ప్రత్యేక సహకారం. ఈ చిత్రంలో శంతను మహేశ్వరి మరియు వియత్నామీస్ నటి ఖన్గన్ నటించారు. దీనికి రహత్ షా కజ్మీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం బెస్ట్ సెల్లింగ్ నవల మడోన్నా ఇన్ ఎ ఫర్ కోట్ ఆధారంగా రూపొందించబడింది. సోషల్ మీడియాలో అవ్నీత్ ఉండటం విశేషం. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో కనెక్ట్ అవుతోంది. ముద్దుల ఎమోజీలతో 'ప్రధాన పాత్ర శక్తి మాత్రమే"అని ఆమె శీర్షిక చదువుతుంది.

సినీ వాయిస్ CINEMA



# 15 ఏళ్ల ప్రేమ.. ఇంత మోసం అనుకోలేదు..!

సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ ఈ మధ్యనే తన బోయ్ ఫ్రెండ్ ఆంటోనిని పెళ్లాడింది. ప్రేమ పెళ్లి గురించి మొన్నటి దాకా చాలా సీక్రెట్‌గా ఉన్న కీర్తి సురేష్ పెళ్లి మరో రెండు వారాలు ఉంది అన్నప్పుడు మాత్రమే మీడియాకు లీక్స్ ఇస్తూ ఆమె కూడా ఓపెన్ అయ్యింది. కథానాయికగా ఇప్పటికే ఎంతోమంది అభిమానుల హృదయాలను దోచేసిన కీర్తి సురేష్ తన మనసు మాత్రం తన స్నేహితుడు ఆంటోనికి ఇచ్చేసింది. ఐతే వీరిద్దరి ప్రేమ అనుబంధం చాలా సీక్రెట్‌గా జరిగింది. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన టైం లోనే కీర్తి సురేష్ ప్రేమలో ఉంది. కానీ ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. ఇంటర్‌లోనే ఆంటోనితో ప్రేమలో పడిందట కీర్తి సురేష్. 2010లోనే అతను ప్రపోజ్ చేశాడని ఐతే 2016 నుంచి మా లవ్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్లిందని చెప్పుకొచ్చింది కీర్తి సురేష్ తను ఇచ్చిన ప్రామిస్ రింగ్‌ని తీయకుండా అలానే ఉంచుకున్నానని. మా పెళ్లి ఒక కల అని.. అది ఇంత ఘనంగా జరిగినందుకు సంతోషంగా ఉందని అంటుంది కీర్తి సురేష్. ఐతే కీర్తి సురేష్ 15 ఏళ్ల ప్రేమ గురించి తెలిసిన ఆడియన్స్ షాక్ అవుతున్నారు. ఇన్నాళ్లు తెర మీద ప్రతి సినిమాలో హీరోలను ప్రేమిస్తూ వచ్చిన అమ్మడు రియల్ లైఫ్ లో ఆల్రెడీ తన మనసు 15 ఏళ్ల క్రితమే ఇచ్చేసిందా ఎంత మోసం అంటూ క్రేజీ కామెంట్స్ పెడుతున్నారు. కీర్తి సురేష్ ఫ్యాన్స్ అయితే ఆమె హ్యాపీ కాబట్టి మేము కూడా హ్యాపీ అనేస్తున్నారు. తన ప్రేమ విషయం తన క్లోజ్ ఫ్రెండ్స్‌తో పాటు కొంతమంది సెలబ్రిటీస్‌కు తెలుసని.. ఐతే దాపరికం అని కాదు కానీ అలా ఉంచాల్సి వచ్చిందని చెప్పుకొచ్చింది కీర్తి సురేష్. సో కీర్తి రియల్ లైఫ్‌లో ప్రేమికుడిని 15 ఏళ్ల క్రితమే ఎంపిక చేసుకుందా అంటూ అవాక్కవ్వడం ఆడియన్స్ వంతు అయ్యింది.

## పుష్ప - ముఫాస
# మధ్యలో నలిగిన బేబీ జాన్




హాలీవుడ్ యానిమేషన్ సినిమాలకి ఇండియాలో కూడా మంచి ప్రేక్షకాదరణ వస్తూ ఉంటుందనే సంగతి అందరికి తెలిసిందే. ముఖ్యంగా 'లయన్ కింగ్' సిరీస్ కి ఇండియాలో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంది. ఇందులో భాగంగా తాజాగా 'ముఫాసా' మూవీ వచ్చింది. 'లయన్ కింగ్'లో 5వ మూవీగా ఈ చిత్రం రిలీజ్ అయ్యింది. 200 మిలియన్ డాలర్స్‌తో ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 20న రిలీజ్ అయిన ఈ చిత్రంలో ఇండియాలో హిందీ, తెలుగు, తమిళ్ భాషలలో కూడా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమాకి రెండో వారంలో కూడా మంచి వసూళ్లు వస్తూ ఉండటం విశేషం. ముఖ్యంగా నార్త్ ఇండియా బెల్ట్‌లో డీసెంట్ వసూళ్లని ఈ చిత్రం అందుకుంటుంది. ఈ సినిమాలోని మెయిన్ లీడ్ లయన్ క్యారెక్టర్ కి షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పారు. ఆయన కూడా మూవీని బాగా ప్రమోట్ చేశారు. దీంతో థియేటర్స్‌లో ఈ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తోంది. 13వ రోజు హిందీలో ఈ సినిమా ఏకంగా 3.93 కోట్లు వసూళ్ళు చేసింది. 2246 షోలలో ఈ చిత్రం పడింది. అయితే దీనికంటే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప 2' కి హిందీలో ఇంకా ఎక్కువ ఆదరణ లభిస్తోంది. 28వ రోజు 'పుష్ప 2' మూవీ థియేటర్స్ లో 9.6 కోట్ల నెట్ వసూళ్లు చేసిందంట. ఈ సినిమాకి 28వ రోజు ఏకంగా 6683 షోలు పడ్డాయి. 29.12 శాతం ఆక్యుపెన్సీ నమోదు అయ్యింది. 10.22 కోట్ల గ్రాస్ కలెక్ట్ అయితే అందులో 9.6 కోట్ల నెట్ ఉంది. 'ముఫాసా' మూవీకి 'పుష్ప 2' కంటే అధికంగా 31.42 శాతం ఆక్యుపెన్సీ నమోదు అయ్యింది. అయితే 'పుష్ప 2'తో పోలిస్తే ఆ సినిమాకి పడిన షోలు తక్కువ అందుకే కలెక్షన్స్ తగ్గాయి.

# సంక్రాంతి పందెం కోడి..





సంక్రాంతికి స్టార్ హీరోల సినిమాల ఫైట్ ఊహించిందో ఈ సారి సీనియర్ స్టార్స్ బాలకృష్ణ, వెంకటేష్ లతో పోటీ పడుతున్నాడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్. గేమ్ ఛేంజర్ సినిమాతో సంక్రాంతికి ముందు వస్తున్న చరణ్ ఆ సినిమాతో బ్లాక్ బస్టర్ టార్గెట్ పెట్టుకున్నాడు. ఐతే ఆ తర్వాత రెండు రోజులకు బాలయ్య డాకు మహారాజ్, నెక్స్ట్ వెంకటేష్ సంక్రాంతికి వస్తున్నాం వస్తున్నాయి. ఐతే ఈ సంక్రాంతికి నిర్మాతగా దిల్ రాజు తన సినిమాతో తనకే పోటీ అవుతున్నా రెండు సినిమాల మీద భారీ నమ్మకంతో ఉన్నాడు. ఐతే దిల్ రాజు మాత్రమే కాదు థమన్ కూడా ఈ సంక్రాంతికి రెండు సినిమాలతో వస్తున్నాడు. సంక్రాంతి పందెం కోడిగా గేమ్ ఛేంజర్ కు ట్రెండీ మ్యూజిక్.. డాకు మహారాజ్ కు మాస్ మ్యూజిక్ ఇలా రెండిటితో థమన్ పోటీకి వస్తున్నాడు. ఒక విధంగా చెప్పాలంటే గేమ్ ఛేంజర్ వర్సెస్ డాకు మహారాజ్ అంటే తన సినిమాకు తానే పోటీగా వస్తున్నాడన్నమాట. గేమ్ ఛేంజర్ సినిమా మ్యూజిక్ విషయంలో థమన్ చాలా కంగారు పడ్డాడు. ఎందుకంటే శంకర్ డైరెక్షన్ లో సినిమా.. తన మ్యూజిక్ కంపోజింగ్ అనేది చాలా ప్రెస్టీజియస్ గా తీసుకున్నాడు. ఐతే శంకర్ ని మాత్రమే కాదు మెగా ఫ్యాన్స్ ని కూడా పూర్తిగా సంతృప్తి పరచే మ్యూజిక్ ఇచ్చాడని చెప్పొచ్చు. ఇక బిజిఎం ఎలా ఉంటుంది అన్నది చూడాలి. మరోపక్క డాకు మహారాజ్ సినిమాకు మాత్రం థమన్ మరోసారి ఊర మాస్ బీట్ వాడినట్టు అనిపిస్తుంది. బాలయ్య సినిమా అనగానే థమన్ స్పెషల్ కేర్ తీసుకుంటాడు. ముఖ్యంగా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ నెక్స్ట్ లెవెల్ ఇస్తాడు. సో థమన్ ఈ రెండు సినిమాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేశాడు. మ్యూజిక్ పరంగా రెండిటికీ తన బెస్ట్ ఇచ్చిన థమన్ సినిమా ఫలితాలు ఏదైనా తన వరకు 100 పర్సెంట్ సాటిస్ఫై అన్నట్టు ఉంది. సంక్రాంతికి ఎన్ని సినిమాలు వచ్చినా పండగ టైం కాబట్టి ఆడియన్స్ రిసీవ్ చేసుకుంటారు. ఐతే ఈ ఫెస్టివల్ కి తెలుగులో 3 క్రేజీ సినిమాలు వస్తున్నాయి. వేటికవే ప్రత్యేకం కాగా వీటిలో ఏ సినిమా విజయం సాధిస్తుందో చూడాలి. రాబోతున్న 3 సినిమాల్లో థమన్ రెండు సినిమాలకు మ్యూజిక్ అందించగా వెంకటేష్ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు.

# నెట్ ఫ్లిక్స్ '2025'.. మామూలు ట్రీట్స్ కావు ఇవీ !



ఓటీటీలకు రోజురోజుకు వేరే లెవెల్ లో ఆదరణ పెరుగుతున్న విషయం తెలిసిందే. సింపుల్ గా చెప్పాలంటే థియేటర్లకు ఆల్టర్నెట్ గా మారిపోయాయి. ఓ రేంజ్ లో రెస్పాన్స్ దక్కించుకుంటున్నాయి. ఆడియన్స్ ను మెప్పించేలా కంటెంట్ ను స్ట్రీమింగ్ చేస్తూ అదరగొడుతున్నాయి. క్రమంగా వ్యూయర్స్ ను పెంచుకుంటున్నాయి. సినిమాలతోపాటు క్రేజీ వెబ్ సిరీస్ లను అందుబాటులోకి తీసుకొస్తూ మెప్పిస్తున్నాయి ఓటీటీలు. అయితే వాటిలో సాలిడ్ కంటెంట్ ను తీసుకొస్తున్న టాప్ ఓటీటీల్లో నెట్ ఫ్లిక్స్ పేరు కచ్చితంగా ఉంటుంది. ఇండియాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మెప్పించే ఎన్నో వెబ్ సిరీసులు నెట్ ఫ్లిక్స్ లో ఇప్పటికే అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. రీసెంట్ గా స్క్విడ్ గేమ్ సీజన్ 2 స్ట్రీమింగ్ కు రావడంతో నెట్ ఫ్లిక్స్ పేరు మరోసారి మార్మోగుతోంది. నిజానికి స్క్విడ్ గేమ్ మొదటి సీజన్ కేవలం ఒక్కరోజులోనే అదిరిపోయే రికార్డులు సాధించింది. దీంతో సీజన్-2పై భారీ బజ్ క్రియేట్ అయింది. అందుకు తగ్గట్లే సీజన్ 2 ఏకంగా 92 దేశాల్లో నాన్ స్టాప్ గా నె%శీ%.1 స్థానంలో కొనసాగుతోంది. మొదటి వారంలోనే అత్యధిక వ్యూస్ అందుకున్న సిరీస్ గా కొత్త రికార్డు క్రియేట్ చేసింది. దాంతోపాటు మరిన్ని ఘనతలు సాధించింది. దీంతో సీజన్ 3 ఎప్పుడని అంతా డిస్కస్ చేసుకోగా.. 2025లోనే స్ట్రీమింగ్ చేయనున్నట్లు కన్ఫర్మ్ చేసేసింది నెట్ ఫ్లిక్స్. సీజన్ 1కు 2కు ఉన్నంత గ్యాప్ ను తీసుకోకుండా ఉండాలని ఫిక్స్ అయినట్లుంది. అయితే స్క్విడ్ గేమ్ సీజన్ 3 తోపాటు మరో రెండు అవైటెడ్ వెబ్ సిరీస్ ల సీక్వెల్స్ ను కూడా రీసెంట్ గా నెట్ ఫ్లిక్స్ కన్ఫర్మ్ చేసింది. అవి కూడా 2025లోనే స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలిపింది. వెడ్నెస్ డే 2, స్ట్రేంజర్ థింగ్స్ సీజన్ 5ను తీసుకురానున్నట్లు ప్రకటించింది. వాటితోపాటు మరిన్ని సినిమాలను ఎప్పటి లాగే తీసుకురానుంది. మొత్తానికి 2025లో తమ యూజర్స్ కు నెట్ ఫ్లిక్స్ వేరే లెవెల్ ట్రీట్స్ ఇవ్వనున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఓ రేంజ్ లో ఎంటర్టైన్ చేయనున్నట్లు అర్థమవుతుంది. ఇప్పటికే బోలెడు మంచి క్వాలిటీ కంటెంట్ ను అందించిన నెట్ ఫ్లిక్స్.. ఫ్యూచర్ లో మరింతగా అలరించాలని టార్గెట్ గా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది.

# టాలీవుడ్ స్ఫూర్తితోనే మాలీవుడ్‌లో ఇంతటి రక్త పాతమా?




మాలీవుడ్ రూట్ మార్చిందా? అవార్డులు అందుకునే ఆర్ట్ చిత్రాల నుంచి కమర్షియల్ పంథాలోకి మారుతుందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. సౌత్ ఇండస్ట్రీ నుంచి మాలీవుడ్ పరిశ్రమ గుర్తింపు అన్నది ఎంతో యూనిక్‌గా ఉంటుంది. కాన్సెప్ట్ బేస్ట్ చిత్రాలు తెరకెక్కించడంలో అక్క డైరెక్టర్లు అంతా మాస్టర్లు. అందుకే జాతీయ, అంత ర్జాతీయ స్థాయిలో అవార్డులు అక్కడ పరిశ్రమకి ఎక్కువగా దక్కుతుంటాయి. అస్కార్ నామినేషన్స్‌లో ఇండియా నుంచి ఎక్కువగా మాలీవుడ్ సినిమాలే ఎంపికైన జాబితాలో ఉంటాయి. అయితే ఇప్పుడా పరిశ్రమ కూడా గేర్ మార్చింది. అవార్డు సినిమాలతో పాటు కమర్షియల్ సినిమాలు చేయడం మొదలైంది. మునుపటి కంటే ఇప్పుడు మాలీవుడ్ సక్సెస్ రేట్ మెరుగ్గా ఉంది. అక్కడ సినిమాలు టాలీవుడ్ లో కూడా రీమేక్ అవుతున్నాయి. ఈ మార్పు గడిచిన ఐదేళ్లలో ఎక్కువగా కనిపిస్తుంది. కమర్షియల్ కోణంలో తెరకెక్కిన సినిమాల్ని టాలీవుడ్ సైతం రీమేక్ చేసి సక్సెస్ లు అందుకుంటుంది. కాన్సెప్ట్ బేస్ట్ చిత్రాల్లో కూడా కాస్త కమర్షి యాల్టీని జొప్పించి కాసులందుకునే టెక్నిక్ ని పట్టుకున్నారు. దీంతో ఇండస్ట్రీ సక్సెస్ రేట్ బాగా పెరిగింది. అక్కడ నటులు దేశవ్యాప్తంగా వెలుగులోకి వస్తున్నారు. ఒకప్పుడు మలయాళం నటులంటే మమ్ముట్టి, మోహన్ లాల్ పేర్లు మాత్రమే ఎక్కువగా వినిపించేవి. కానీ నేడు తర్వాత జనరేషన్ హీరోల పేర్లు కూడా పాన్ ఇండియాలో బాగానే వెలుగులోకి వస్తున్నాయి. అందులోనూ అక్కడ సినిమాలకు తెలుగులో మంచి ఆదరణ దక్కుతుంది. -2018-, మంజమ్మల్ బోయ్స్, లాంటి సినిమాలు తెలుగులో కాసుల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. ఇటీవలే ఉన్ని ముకుందన్ నటించిన మార్కో రిలీజ్ అయింది. హనీఫ్ అదేని తెరకెక్కించిన ఈ ఆక్టేన్ యాక్షన్ చిత్రాన్ని చూసి తెలుగు ప్రేక్షకులకు నివ్వెర పోతున్నారు. మాలీవుడ్ పరిశ్రమ నుంచి ఇంతటి దారుణమైన రక్తపాతమా? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటి వరకూ ఈ రేంజ్ లో హింసను ఏ డైరెక్టర్ వెండి తెరపై ఆవిష్కరించలేదు. చేస్తే అది సంచలనమే అవ్వాలి అన్నట్లు హనీఫ్ అత్యంత కర్కశంగా ఈ సినిమాని తెరకెక్కించాడు. ఇప్పటికే సినిమా 100 కోట్ల క్లబ్ లో నూ చేరింది. మాలీవుడ్ నుంచి ఏమాత్రం ఊహించని కంటెంట్ ఇది. బహుశా ఈ మార్పుకు పరోక్షంగా టాలీవుడ్ కారణం కావొచ్చు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్య వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by **KHANDAVELLI SUNIL KUMAR,** H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: **KHANDAVELLI SUNIL KUMAR.** RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com